యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)
1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 9550504718, 9030757571

# దెబోరా స్వరం

సంపుటి : 16 సంచిక : 2 మార్చి - ఏప్రిల్ 2023 విడి ప్రతి వెల రూ. 5/- సం॥ర చందా రూ॥ 100/-

సంపాదకీయం

## పునరుత్థాన బలం

- జాయ్ చెరియన్

***సంపాదకురాలి కలమునుండి...***

దెబోరాస్వరం పాఠకులకందరికీ పునరుత్థాన పండుగ శుభములు.

పునరుత్థానము అనగా దేవుని మహాశక్తి ప్రదర్శన. యేసుక్రీస్తు మానవాళికొరకు ఆయన ప్రాణం అర్పించాడు. ఆయన సిలువలో ప్రాణం విడిచాడు. సమాధి చేయబడ్డాడు. ఆయన చెప్పిన రీతిగానే మూడవ దినం తిరిగి లేచాడు. లేఖనములు నెరవేరాయి. ప్రవచనములు నెరవేరాయి. యేసు స్వయంగా పలికిన మాట “ఇదిగో నన్ను సిలువ వేస్తారు మానవాళికొరకు నేను మరణించి మూడవ రోజు పునరుత్థానుడనౌతానని”, అది నెరవేరడం గొప్ప సత్యం. పాత నిబంధనలో చెప్పిన ప్రవచనాలు క్రొత్త నిబంధనలో నెరవేరడం సత్యవంతమైనవని మనం నమ్మాలి. యేసుప్రభువు జయశాలి. యోహాను సువార్త 16:33లో చెప్పిన విధముగా “ఈ లోకములో మీకు శ్రమ కలుగుతుంది. అయిననూ మీరు ధైర్యము వహించుడి. నేను లోకమును జయించి యున్నాను.” అనే వాక్యం మనలను ఎంతో బలపరుస్తుంది. ఎందుకంటే జీవితంలో ఎన్నో ఇబ్బందులు, ఆటుపోట్లు ఎదురైనప్పుడు ఈ వాక్యం మనలను ఎంతో ఆదరిస్తుంది. ధైర్యం, బలమిస్తుంది. ఎందుకంటే పునరుత్థానుడైన ప్రభువు ఆయన మరణాన్ని గెలిచాడు, సమాధిని గెలిచాడు. బండను గెలిచాడు ముద్రను గెలిచాడు, కావలివారిని గెలిచాడు. లోకాన్ని జయించాడు సాతాన్ని ఓడించాడు. ఇట్టి జయశాలి అయిన ప్రభువు మనకు సదా తోడై ఉన్నాడు. ఇటువంటి జయశాలియైన ప్రభువు మనకు తోడుంటే మనకికూడా గొప్ప విజయం కలుగుతుందని నమ్మాలి.

క్రైస్తవ జీవితంలో మనం రెండు కార్యాలు చేయాలి.

ఒకటి **సిలువను ధ్యానించుట :** సిలువలో యేసు చూపిన త్యాగమును, సహనమును మనం ధ్యానించాలి. దీని ద్వారా మనం గొప్ప శక్తితో నింపబడతాం. ఈ లోకంలో మనకున్న శ్రమలు ఎన్నదగినవి కావు పరిశుద్ధాత్ముడు మనలను ఆదరిస్తాడు. శక్తితో నింపుతాడు. అలాగుననే రెండవదిగా **పునరుత్థాన శక్తిని ధ్యానించుట :-** మనం పునరుత్థాన శక్తిని ధ్యానిస్తే అన్ని విషయాలమీద గొప్ప విజయం సాధిస్తాము.

ఫిలిప్పీ పత్రిక 3:11లో **“ఏ విధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణవిషయములో సమానానుభవముగలవాడనై, ఆయనను, ఆయన పునరుత్థానబలమును ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో పాలివాడనగుట ఎట్టిదో యెరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను”.** ఈ విధంగా యేసుక్రీస్తు సిలువశక్తి పునరుత్థాన బలం ఎరిగిన చాలును. ఈ రెండు వాహనానికి చక్రాల వంటివి. క్రీస్తు సిలువలో మరణించి సజీవుడై లేచాడు. పునరుత్థానుడయ్యాడు.

ఎఫెసి పత్రికలో పునరుత్థాన బలం గురించి వ్రాయబడింది **“ఆయన అ బలాతిశయముచేత క్రీస్తును మృతులలోనుండి లేపి, సమస్తమైన ఆధిపత్యముకంటెను అధికారముకంటెను శక్తికంటెను ప్రభుత్వముకంటెను, ఈ యుగమునందుమాత్రమే గాక రాబోవు యుగమందును పేరుపొందిన ప్రతి నామముకంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడిపార్శ్వమున కూర్చుండ బెట్టుకొనియున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైన ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది.”**

– ఎఫెసి. 1:20–23

తండ్రియైన దేవుడు ఆయన కుమారునికి అన్నిటిపైన ఆధిపత్యం ఇచ్చాడు. సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచాడు. పరలోకంలోను భూలోకంలోను నాకు సర్వాధికారం యివ్వబడింది అంటాడు. మృతులలోనుండి లేపిన ఆత్మ యింతటి బలాభివృద్ధి కలిగి ఉంటుంది. మనం ఉదయం లేవగానే సిలువను చూసినప్పుడు సిలువలో యేసు చూపిన త్యాగమును, పునరుత్థాన శక్తిని ధ్యానిస్తే ప్రతి పరిస్థితిలో జయమును చూస్తాము. యు.పి.ఎఫ్. సంఘములో 40 రోజులు సిలువ ధ్యానాలు చేస్తాం. పునరుత్థాన శక్తి గురించికూడా 40 రోజులు వివరిస్తే (ధ్యానిస్తే) పునరుత్థాన సత్యం గ్రహింపు కలుగుతుందని, జీవితంలో ఓడిపోరని, ఆందోళన, భయము, భీతి మటుమాయం అవుతుందని నమ్ముచున్నాను.

**“మృతులలోనుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించినయెడల, మృతులలోనుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడా మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును.”** – రోమా 8:11

యేసుప్రభువు మరణించి మూడవ దినం లేచాడు. ప్రపంచంలో ఏ సమాధి ఖాళీగా లేదు. యేసుప్రభువు సమాధి మాత్రమే ఖాళీగా ఉందని మనకు అర్థం అవుతుంది. ఆయన సజీవుడై లేచియున్నాడు. కాబట్టి సజీవుడైన ప్రభువును మనం వెదకుతున్నాం, ఆరాధిస్తున్నాం, వెంబడిస్తున్నాం, ఆయనను కలిగియున్నాం. అందుకే అపొస్తలులంటారు ఆయనవలన మేము జీవిస్తున్నాం ఉనికిని కలిగియున్నాం బ్రతికియున్నాము. వాక్యమైయున్న దేవుడు, వాక్యం మనల్ని బ్రతికిస్తుంది. శ్రమలో నెమ్మదినిస్తుంది.

మృతులలోనుండి లేపినవాని ఆత్మ నాలో ఉంటే దేవుడు నాకిచ్చిన పరిచర్యలో, దేవుడు నాకిచ్చిన ఆత్మద్వారా నేను ధైర్యంగా చెప్పగలను యేసు నామములో ప్రార్థించగా వైద్యులు నయంచేయలేని రోగాలుకూడా లయమైపోతున్నవి. దేవునికి మహిమ కలుగును గాక. క్రైస్తవులైన మనం ప్రభువును కలిగి ఉన్నాం కాబట్టి మనం మరణానికి భయడం. దేనికీ భయపడం. మత్తయి 28:5 లో స్త్రీలతో దేవుడిచ్చిన మాట – మీరు భయపడకుడి. ఈ దినాల్లో ప్రతి ఒక్కరికి మరణభయం ఆవరించియున్నది. ఈ మరణభయం అనే దాస్యత్వంనుండి విడిపించడానికి ప్రభువు నరావతారిగా వచ్చి తన ప్రాణం అర్పించి తిరిగి మూడవ రోజు పునరుత్థానుడై

తన పునరుత్థాన మహిమను చాటించాడు. మత్తయి 28వ అధ్యాయంలో స్త్రీలు ఆయన శరీరం వెదుక వచ్చారు. ఆయన మృతదేహానికి సుగంధద్రవ్యములను పూయడానికి వచ్చారు. మత్తయి 28:5లో దూత - మీరు భయపడకుడి సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును. ఆయన లేచియున్నాడనెను. స్త్రీలకు కలిగిన ప్రత్యక్షతను చూడండి. స్త్రీలకు దేవుడిచ్చిన మాట బలహీనతలనుండి విడిపిస్తుంది స్త్రీలు అబలలని లేక బలహీనులని, వారి స్థితిగతులు అంతగా అంచనాకు మించి ఉండవని ఇలాంటి అపోహలున్నప్పుడు యేసుప్రభువు స్త్రీలను ఎంతగా గౌరవించాడు. ఎంతగా వారిని ఆదరించాడు. ఎంత ధైర్యపు మాటలు పలికాడు అని పునరుత్థాన సందేశంలో నాకు పరిశుద్ధాత్ముడు జ్ఞాపకం చేశాడు.

మొట్టమొదటి రెండు ప్రత్యక్షతలుకూడా స్త్రీలకే కలిగాయి. యేసుప్రభు మరణించి తిరిగి లేచిన తర్వాత నలభై రోజులవరకు తన ప్రత్యక్షతలు, తన శిష్యులకు ఋజువులతో చూపించాడు. ఎందుకంటే ఆయనను నమ్మాలని, పునరుత్థాను డయ్యాడని దాదాపు 12 ప్రత్యక్షతలు మనం పరిశుద్ధ గ్రంథంలో చూస్తున్నాం. దానిలో మొట్టమొదటి రెండు ప్రత్యక్షతలు ఒక స్త్రీకి కలిగినవి. ఆమె యేసుప్రభువుని మిక్కుటముగా ప్రేమించేది. ప్రేమలో భయం లేదు. ప్రేమలో మహాశక్తి కలదు. పెందలకడనే ఆమె సమాధి తోటకు వెళ్ళింది. ఎందుకంటే యేసుప్రభువలన ఆమె జీవితంలో ఉన్న సాతాను శక్తులనుండి విడుదల కలిగింది. ఆమె కట్లన్నీ తెగిపోయినవి. కాబట్టి కృతజ్ఞతగా ఆమె ప్రభువును మిక్కుటంగా ప్రేమించేది. అందుకే ప్రభువును వెతుక్కుంటూ వచ్చింది. ఆమె ఏనాడు ఊహించలేదు ఆమెకట్టి ఘనత కలుగుతుందని, యేసుప్రభువు మొట్టమొదటి ప్రత్యక్షత ఆమెకు కలుగుతుందని, చరిత్రలో మిగిలిపోతుందని ఆమెకు తెలియదు. ఆమె-శవ శరీరానికి సుగంధద్రవ్యములు పూయడానికి వచ్చింది. కాని ప్రభువు ప్రత్యక్షమై స్వరం వినిపించాడు "అమ్మా నీవెందుకు ఏడుస్తున్నావు." ఇక్కడ మనం గమనించగలం ఆమె ఒక పాపాత్మురాలు, వ్యభిచారిణి అట్టి పాపిని యేసుప్రభువు ప్రేమించి, సాతాను శక్తులనుండి విడిపించి ఆమెను శిష్యరికంలో చేర్చుకొన్నాడు. లూకా 8:2 లో చూస్తే అనేకమంది స్త్రీలు యేసుప్రభువును వెంబడించారు. వారిలో మగ్దలేనే మరియకూడా ఉంది. ఆమె వ్యాపారస్థురాలు అయినా ప్రభువును తన సమయంతో, ధనంతో, తన శక్తితో వెంబడించింది కాబట్టి ప్రభువుకూడా ఆమెను మిక్కుటంగా ప్రేమించాడు అందుకే అమ్మా నీవెవరిని వెదుకుతున్నావు, ఎందుకేడుస్తున్నావని. మరియా, అని పేరు పెట్టి పిలిచి ఆమెకు ఒక గొప్ప పని అప్పగించాడు. యోహాను సువార్త 20వ అధ్యాయంలో చూస్తే నీవు వెళ్ళి శిష్యులకు చెప్పమన్నాడు. ఆయన పునరుత్థానుడయ్యాడనే సత్యం వెళ్ళి చెప్పమని యేసుప్రభు ఆ స్త్రీకి ఆదేశమిచ్చాడు. ఈ విధంగా ఆ స్త్రీ రాబోయే కాలంలో అపొస్తులులకు అపొస్తురాలైంది.

ఈరోజు నీవు ఒకటి గ్రహించాలి. క్రుంగిపోయి ఉన్నావేమో ప్రభువు నీతో మాట్లాడుతున్నాడు. ఎవ్వరూ నిన్ను గుర్తించకపోయినా నీ స్వచ్ఛతను, నీ సామర్థ్యాన్ని గుర్తించకపోయినా నీకు ప్రభువుమీద ఉన్న ప్రేమను గుర్తించకపోయినా ఆయన తప్పక నిన్ను పైకి లేవనెత్తుతాడు. నీకు పని అప్పగిస్తాడు. నీవు ఆ పని చేస్తావు నీవు దేవుని ఘనపరచే స్త్రీగా ఉంటావు.

రెండవ ప్రత్యక్షతకూడా స్త్రీలకే కలిగింది. వాళ్ళతో భయపడవద్దని సెలవిస్తున్నాడు. అభయ వాక్కిస్తున్నాడు మరియు శుభము కలుగుగాక అంటున్నాడు. విజయ వాక్కిస్తున్నాడు నేను మరణాన్ని గెలిచానని వాగ్దాన వాక్కిస్తున్నాడు. ఇవన్నీ స్త్రీలతో చెప్పినట్లు మనం గమనిస్తాం.

చాలా మంది స్త్రీలు కుటుంబ జీవితంలో ఓడిపోయినప్పుడు ఉద్యోగ సమస్యలచేత, అనారోగ్య సమస్యలచేత, దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నప్పుడు మీరు తప్పకుండా పునరుత్థాన మహిమను ధ్యానించి శక్తిని పుంజుకోవాలి. భయములో ఉండేవారికి ఆదరణవాక్కును, మీరేల భయపడుచున్నారు మీ హృదయంలో సందేహమేల అనెను కాని అక్కడ వారు నమ్మలేకపోతున్నారు. వారి అనుమానం చెదరగొట్టుటకు ప్రభువు ఈ మాట పలుకుతున్నాడు **"అయితే యేసు వారియొద్దకు వచ్చి పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్క నామమున వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను."** - మత్తయి 28:18-20. పునరుత్థానుడైన ప్రభువు ఎంత చక్కని వాగ్దానవాక్కులను వెల్లడిపరుస్తున్నాడు! ఎంత ఆదరణ కలిగే మాటలు! ఎవరైనా ఒంటరితనంలో ఉన్నారా? ఏ బంధు సహాయం లేదనుకుంటున్నారా? మీకెవ్వరూ లేరనుకుంటున్నారా? మీరు ఓడిపోతున్నామనుకుంటున్నారా? ఈ అభయవాక్కులు, ఈ వాగ్దాన వాక్కులు, ఈ శుభవాక్కులు, విజయ వాక్కులను నీవు స్మరించాలి. ఎందుకంటే యేసుప్రభువు మాత్రమే నీ జీవితపర్యంతము నీతో ఉంటాడు. ఆనాడు మోషేతో సెలవిచ్చాడు కదా నిర్గమకాండం 3వ అధ్యాయంలో - ఎవరు పంపారు నిన్ను అంటే జావాబియ్య మన్నాడు కదా ఉన్నవాడను నేను అని, ఆయన జీవిస్తున్నాడు. ఆయన ఎప్పటికీ ఉన్నవాడు. యుగసమాప్తివరకు సదాకాలము నీకు తోడుగా ఉన్నవాడు అనే గొప్పమాట. ఎవరైనా అవిశ్వాసముతో ఉంటే వారికికూడా దేవుడు పునరుత్థాన అభయ వాక్కులు అనుగ్రహిస్తున్నాడు. తోమా గురించి మనకు తెలుసు యేసుప్రభుయొక్క ప్రత్యక్షతను తోమా నమ్మలేదు నేను ప్రభుయొక్క గాయములో వ్రేలు పెట్టి చూస్తేగాని నమ్మను ఆయన ప్రక్కలో చేయిపెట్టి చూచి నమ్ముతాను. చూడకుండా నమ్మను అంటాడు. అట్టి అవిశ్వాసినికూడా బలపరచేది యేసుప్రభు పునరుత్థాన ప్రత్యక్షత.

ప్రభువు ప్రేమగురించి ఆలోచిస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకంటే మనల్ని ఎవరైనా నమ్మకుంటే మనం వారిని తృణీకరిస్తాం. కాని యేసుప్రభువు అలాకాదు. అవిశ్వాసి అయిన తోమాయొక్క విశ్వాసాన్ని స్థిరపరచడానికి, ప్రత్యేకమైన ప్రత్యక్షతనిచ్చి, నా గాయాల్లో నీ చేతులుంచు నమ్ము అవిశ్వాసిగా కాకుండా విశ్వాసిగా ఉండు నమ్ము అంటాడు. ఎంతప్రేమ యేసుప్రభువుది! అట్టి తోమా విశ్వాసంలో స్థిరపరచబడిన తర్వాత భారత దేశానికి వచ్చాడు. ప్రభువునందు అతిశయముతో చెప్పుచున్నాను. తోమా భారతదేశంలో మొదట కేరళ ప్రాంతానికి వచ్చిన కారణాన అప్పటి బ్రాహ్మణులు యేసుప్రభువు రుచి యెరిగి యున్నారు. మా తాత ముత్తాతలు అప్పటి సిరియన్ క్రిస్టియన్‌లుగా పిలువబడతారు. ఒకవేళ కేరళ రాష్ట్రం రాకపోతే భారతదేశంలో అడుగు పెట్టకపోతే ఈరోజు ప్రభువుయొక్క రుచి తెలియకపోయేదేమో. ఎందుకు చెబుతున్నానంటే ఒక బలహీనుణ్ణి, ఒక అవిశ్వాసి, నమ్మలేని స్థితిలో ఉన్న వ్యక్తిని తన ప్రత్యక్షతద్వారా బలపరచి స్థిరపరచి విశ్వాసంతో నింపి, తన జీవితాన్ని ప్రభువుకొరకు అర్పించుకొని దేశంకాని దేశం పరదేశానికి వచ్చి ప్రభువుయొక్క పునరుత్థాన సత్యాన్ని ప్రకటించి, దుర్మార్గులచేత చంపబడి హతసాక్షిగా మారిపోయాడంటే యేసుక్రీస్తు మరణంలో శక్తి పునరుత్థానములో ఎంత బలముందో మనకు అర్థం అవుతుంది. యేసుక్రీస్తును వెంబడించిన పన్నెండు మంది శిష్యుల్లో ఒక శిష్యుడు మనకు తెలుసు. దొంగ యూదా డబ్బుమీద ఉన్న ఆశతో తన్నుతాను ఉరి వేసికున్నాడు చనిపోయాడు. మూడు సంవత్సరాలు యేసుతో నడిచాడు యేసులోని శక్తిని దైవత్వాన్ని నమ్మలేదు. యేసుప్రభువు తోమాతో అన్న మాటలు నీవు విశ్వాసిగా ఉండు. "చూచి నమ్మిన వారికంటె చూడక నమ్మినవారు ధన్యులు" యూదా చూశాడు అనుభవించాడు, యేసుప్రభుతోనే నడిచాడు కాని నమ్మలేదు. అతనిది భయంకరమైన అవసానం. తక్కిన పదకొండు మంది శిష్యులుకూడా యేసుప్రభువును అనుసరించారు. నమ్మారు సత్యసువార్తను ప్రకటించారు. పునరుత్థానుడైన ప్రభువుకొరకు తమ జీవితాలు సమర్పించుకున్నారు. ప్రభువుయొక్క ప్రత్యక్షతలు నమ్మారు. లోకమును తలక్రిందులుగా చేసే వ్యక్తులుగా మారిపోయారు. దేవునికి స్తోత్రం. చూడండి పునరుత్థాన శక్తి ప్రతి వ్యక్తిలో ఏవిధంగా పని చేస్తుందో. ఇది మహాశక్తి. ఇట్టి శక్తి గురించి నీవు ప్రతిదినం కొన్ని నిమిషాలైనా ధ్యానించడం ఎంత ఉత్తమం! అందుకే అపొస్తలుడైన పౌలు అంటున్నాడు యేసుక్రీస్తుయొక్క సిలువ శక్తి, యేసుక్రీస్తుయొక్క పునరుత్థాన బలం దీని నిమిత్తం నాకు కలిగినదంతా పెంటలో సమానంగా ఎంచుకుంటున్నాను. ఈ రెండుంటే చాలంటున్నాడు పౌలు.

అలాగే పేతురు గురించి చూస్తే - పేతురు బలహీనుడు. మూడుసార్లు బొంకుతాడు నేను ప్రభువును ఎరుగనని. నీకొరకు నా ప్రాణం అర్పిస్తానని ఎంత గంభీరమైన మాటలు పలికిన పేతురు తీరా సమయం వచ్చినప్పుడు ఆయనెవరో ఎరుగనని మూడు సార్లు బొంకాడు. అట్టి పేతురునుకూడా ప్రభువు ప్రేమించి

పునరుత్థాన ప్రత్యక్షతనిచ్చాడు. మూడు సార్లు పరికించాడు. పేతురు; నీవు నన్ను ప్రేమిస్తున్నావా? అయితే నా గొఱ్ఱెలు మేపు. రెండవసారి పేతురు; నీవు నన్ను ప్రేమిస్తున్నావా అంటే అవును తండ్రీ నీకే తెలుసు ప్రభువా, అయితే నా చిన్న గొఱ్ఱెలను మేపు. ప్రేమిస్తున్నావా అని మూడోసారి అడిగితే నేను ప్రేమిస్తున్నాను అన్నప్పుడు అయితే నా గొఱ్ఱెలను కాయుము అన్నాడు ఎంత పెద్ద బాధ్యత అది. మనం అనుకుంటాము ప్రభువును ప్రేమిస్తే చాలని. కాని ప్రభువును ప్రేమించిన ప్రతి ఒక్కరికి బాధ్యత ఉంది. ఈ లోకంలో ప్రభువుయొక్క ప్రేమను ప్రకటించటానికి, ప్రభువుయొక్క శక్తిని ప్రకటించడానికి, ప్రభువుయొక్క సిలువను ప్రకటించడానికి, ప్రభువుయొక్క పునరుత్థాన బలాన్ని ప్రకటించడానికి బాధ్యతకూడా ఉందని మనం గమనించాలి. ఈ పునరుత్థాన సందేశంలో బలహీనులను, అవిశ్వాసులను, పిరికితనంగలవారిని యేసుప్రభువు పునరుత్థానుడై వారిని ఏ విధంగా బలపరచి, లోకమునే తలక్రిందులు చేసే వ్యక్తులుగా మార్చివేశాడు. అదే పునరుత్థాన బలం. తర్వాత చూసినప్పుడు కొందరు శిష్యులు భయపడుతున్నారు. శిష్యులందరూ విద్యావంతులు, జ్ఞానమున్న వాళ్ళని కాదు. ఆశ్చర్యపరచే విషయం ఏమిటంటే యేసుప్రభువు ఎన్నికలో ఉన్న శిష్యులు విద్యలేని పామరులు అని వాక్యంలో ఉంది. మరి అట్టివారిని అన్ని కొరతలలో ఉన్నవారిని ఎన్నుకొని వారిని తన మహిమతో, బలంతో, శక్తితో నింపి ప్రయోజనకరమైన వ్యక్తులుగా అంటే లోకానికి సత్యసువార్త అందించే వ్యక్తులుగా తీర్చిదిద్దిన ఘనత పునరుత్థానుడైన ప్రభువుదేనని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

లూకా సువార్తలో – పునరుత్థానుడైన ప్రభువు ఎంత అద్భుతంగా తన పునరుత్థాన మహిమను తన శిష్యులకు చాటిస్తున్నాడో చూస్తాం. **“వారు ఈలాగు మాటలాడుచుండగా ఆయన వారి మధ్యను నిలచి మీకు సమాధానమవుగాకని వారితో అనెను అయితే వారు దిగులుపడి భయాక్రాంతులై, భూతము తమకు కనబడెనని తలంచిరి.”** – లూకా 24:37 అప్పుడాయన వారి భయాన్ని చూసి **“అప్పుడాయన – మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల? నేనే ఆయననుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నాకున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును, మాంసమును భూతమున కుండవని చెప్పి తన చేతులను, పాదములను వారికి చూపెను.”** – లూకా 24:38–40. పునరుత్థానుడయ్యాడు గాని ఆ గాయములు అలానే ఉన్నవి. తన గాయపడిన హస్తాలు, పాదాలు వారి విశ్వాసాన్ని స్థిరపరచడానికి యేసుప్రభువు వాటిని పట్టిచూడమంటున్నాడు. నేను సజీవుడనైన క్రీస్తును. నన్ను తాకి చూడండి అని, నేనే ఆయనని చెప్పెను. ఇట్టి అవిశ్వాసుల విశ్వాసమును స్థిరపరచడానికి యేసుప్రభువుకి ఎంత సహనము. తర్వాత నాకున్నట్టు ఎముకలును మాంసమును భూతములకు ఉండదని చెప్పి తన చేతులను పాదములను వారికి చూపెను. అయితే వారు సంతోషముచేత యింకనూ నమ్మక ఆశ్చర్యపడుచుండగా మీయొద్ద ఏమైనా ఆహారము కలదా అని వారిని అడిగాడు. వారు కాల్చిన చేప ముక్కను ఆయనకిచ్చారు. ఆయన దానిని తీసికొని వారియెదుట భుజించాడు. ఈ విధంగా యేసుప్రభువు వారి నమ్మకాన్ని స్థిరపరచాడు. మీలో ఎవరికైనా కలవరముందా? యేసుప్రభువు పునరుత్థానాన్ని ఎవరైనా నమ్మకుండా ఉన్నారా? ఎవరైనా సమస్యలకు భయపడి పిరికితనం గలవారున్నారా? దేవుని వాక్యాన్ని నమ్మకుండా అవిశ్వాసులుగా ఉన్నారా? అధైర్యంతో ఉన్నారా? మీ జీవితాన్ని ఏవిధంగా ముందుకు నెట్టుకొని వెళ్ళాలి? ఎన్నోబాధలు అనుభవిస్తూ మీ హృదయాలు కలవరంతో ఉన్నాయా? ప్రభువు ఈ పునరుత్థాన శక్తిని మీకనుగ్రహిస్తున్నాడు.

దేవునికి స్తోత్రం. అపజయంచేత బాధపడేవారికికూడా దేవుని సేవకురాలిగా ఈ శుభవర్తమానం అందిస్తున్నాను. యోహాను సువార్త 21 అధ్యాయం చూసినప్పుడు “అక్కడ వారు రాత్రంతా చేపలు పడుతున్నారు. వారి జీవనోపాధి అది. యేసుప్రభువు ఉన్నప్పుడు మూడున్నర సంవత్సరాలు సునాయాసంగా గడిచిపోయాయి. ప్రభు ఎక్కడకి వెళ్తే అక్కడకి వెళ్ళారు. దేవునిచేత ఏర్పాటైనవారు ఎక్కడకి వెళ్ళినా, వారి వెంట వెళ్ళినవారికికూడా జనము అదే రీతిగా చూశారు అప్పుడు వారికి ప్రయాసం లేదు. యేసుప్రభువు మరణించిన తర్వాత వారి భవిష్యత్తు ఏంటి? వారి భార్యాబిడ్డలని ఎవరు చూస్తారు? కుటుంబాలు ఏవిధంగా నడుస్తాయని వారికి అనుమానం కలిగింది. పేతురు మరికొందరు శిష్యులతో కలసి గలిలయ సముద్రతీరాన చేపలు పట్టబోతున్నాడు. రాత్రంతా ప్రయాసపడినా ఫలితం దక్కలేదు. కాని యేసుప్రభువు తన ప్రత్యక్షతను ఇలాంటి అవిశ్వాసులైన శిష్యులకు కనుపరచాడు. మీరు దోనె కుడి ప్రక్కన వల వేయుడి మీకు దొరుకుతాయి అన్నాడు. యేసు మాట విని వారు కుడి ప్రక్కన వల వేయగా వారికి విస్తారమైన చేపలరాశి దొరికింది లాగడానికి వీలు కాలేదు. అంటే అంత పునరుత్థాన మహిమ కనుపరచాడు. దేవుడు మాట్లాడుతున్నాడు. జీవితంలో ఓడిపోయావా? అపజయాన్ని ఎదుర్కొంటున్నావా? నీవల్ల కాదని నీవనుకుంటే పునరుత్థాన సువర్తమానాన్ని దైవదాసురాలిగా మీకందిస్తున్నాను. ఆయన నిన్ను విజయోత్సవంగా ఊరేగించి నిన్ను ఘనపరచే దినం తప్పక వస్తుంది. కేవలం నీవు ఆయన మరణ పునరుత్థానములందు విశ్వాసముంచాలి, నమ్మాలని నేను వాక్యాన్ని ఆధారం చేసికొని మీతో మాట్లాడుతున్నాను. అలాగే ఆందోళన మానవ సహజం. ఏదైనా ఒక సమస్య రాగానే మొట్టమొదట ఎంతటి భక్తులైనా ఎంతటి విశ్వాసులైనా ఆందోళన చెందుతారు. పునరుత్థాన సందేశంలో ఒక భాగంగా మీకు చెప్పాలి. మీ హృదయములు ఎప్పుడుకూడా కలవరపడనియ్యకుడి అని యేసుప్రభువు హెచ్చరించాడు. యోహాను సువార్త 14:1–3 నేను మీకొరకు అనేక నివాసములు సిద్ధపరచుచున్నాను. నేనుండు చోటికి మిమ్మును నేను తీసికొని వెళ్తాను.” ఆందోళనలో ఉన్న శిష్యులతో ప్రభువు అన్న మాట యిది. లూకా 24:32 లో వారు యేసు మాటలు వింటున్నప్పుడు వారి గుండెలో మంట పుట్టింది. అంటే ఈ రోజు ఆందోళనలో ఉన్న దేవుని బిడ్డలతో దేవుడు మాట్లాడుతున్నాడు. నీవు ఆందోళన పడే అవసరం లేదు. ప్రభువు నీ వెంట ఉంటాడు. నీతో మాట్లాడతాడు. నీ వెంట నడుస్తాడు. నిన్ను ప్రోత్సాహపరుస్తాడు. క్రుంగిన నిన్ను లేవనెత్తుతాడు. ఆందోళనలో ఉన్న నీకు సమాధానమిస్తాడు.

11 మంది శిష్యులు ఒక గదిలోనికి వెళ్ళి గొళ్ళెం వేసికొని భయపడుతున్నారు. ఎందుకంటే యేసు నడిచినదారిలో నడిచినవారినికూడా సిలువ వేస్తారని, యేసును సిలువ వేసిన రోమా సామ్రాజ్యం మమ్మునుకూడా సిలువ వేస్తుందని భయంతో ఉన్నప్పుడు యేసు వారి మధ్యకు వచ్చి భయపడవద్దని, మీకు సమాధానమౌనుగాక అని సెలవిచ్చాడు. శుభం పలికాడు. పరిశుద్ధాత్మను పొందమన్నాడు. దేవుని ఆత్మతో మీరు నింపబడాలి. మీయొక్క ఆందోళననుండి మీరు విడిపింపబడతారు. రోగం మిమ్మును బాధిస్తుంటే మీరు కుమిలిపోయే అవసరం లేదు. సిలువ పై మీకొరకు వెల చెల్లించిన ప్రభువు మరణించి మూడవ రోజు తిరిగి పునరుత్థానుడై, పునరుత్థాన హామీలు యిస్తున్నాడు. అభయ వాక్కులిస్తున్నాడు. ఏంటంటే రోమా 8:11 – క్రీస్తును లేపినవాని ఆత్మ మనలో ఉన్నది గనుక, అట్టి ఆత్మద్వారా చావునకు లోనైన మన శరీరంకూడా మనలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును. మనం బ్రతికున్నప్పుడే బలహీనతలనుండి విడిపించే శక్తి పునరుత్థాన శక్తి అని గ్రహించాలి. నరుని ఆత్మ వాని వ్యాధినోర్చును. వ్యాధి ఉంటే ఆ వ్యాధిగ్రస్తుడు పునరుత్థాన శక్తితో నింపబడాలి. ఆ వ్యాధి వాని శరీరంలో కాదు వాని పాదాలక్రింద ఉంటుంది. యేసుప్రభువును కలిగి యున్నాడు కాబట్టి ఆ పునరుత్థాన బలం కణకణంలో పనిచేస్తుందని చెప్పగలను.


మరి కొవిడ్ వచ్చి రెండు సంవత్సరాలైంది. మరణ భయంనుండి విడుదల కావాలి, కొవిడ్నుండి మనలను విడిపించిన దేవునికి వందనాలు. ఆయన పూజార్హుడు. సత్యదేవుడు ఆయన ఆరాధనకు యోగ్యుడు. ప్రార్థన ఆలకించే దేవుడు. సజీవుడు, నేను జీవస్తున్నాను గనుక మీరును జీవిస్తారు అన్న దేవుడు. అంటే సజీవుడైన దేవుని మనం ఆరాధిస్తున్నాం. ఆయన ఆత్మను మనం కలిగి ఉన్నాం. మరణానికి మనం భయపడం. మనం మరణించినా ప్రభువుకొరకే జీవించినా ప్రభువుకొరకే. మనం ఈ లోకంనుండి దాటిపోయినా ప్రభువు దగ్గరకే వెళ్తున్నాం. మనం ప్రభువువారము. ఈ పునరుత్థాన శక్తిలో మనం గమనించాల్సింది ఏంటంటే మరణానికి మనం భయపడం. ఓ మరణమా నీ ముల్లెక్కడ? మరణం మీద యేసుప్రభువు సాధించిన విజయం. **“క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది; మర్త్యమైన ఈ శరీరము అమర్త్యతను ధరించు కొనవలసియున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది, అమర్త్యతను ధరించుకొనినప్పుడు, – విజయమందు మరణము**

మింగివేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును. ఓ మరణమా నీ విజయమెక్కడ? ఓ మరణమా నీ ముల్లెక్కడ. మరణపు ముల్లు పాపము, పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే. అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక. –1 కొరింథీ 15:53–57. అంటే క్రైస్తవులకు మరణ భయం ఉండకూడదు. ఎప్పుడైనా మన కుటుంబంలో, బంధువుల్లో ఎవరైన చనిపోతే మనం అన్యులు రోదించినట్లు రోదించకూడదు అని పరిశుద్ధ గ్రంథములో ఉంది. అన్యులకు నిరీక్షణ లేదు కాని మనకు నిరీక్షణ ఉంది. మనం చనిపోయినను తిరిగి బ్రతుకుతాం. యేసుప్రభువు మార్తతో అంటాడు కదా పునరుత్థానము నేను, జీవము నేను. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను తిరిగి బ్రతుకుతాడు. అంటే అట్టి నిరీక్షణ కలిగిన మనము యేసుప్రభువు సిలువ మరణంద్వారా మరణపు ముల్లును విరిచాడు. మరణానికి ఇకమీదట మనమీద ప్రభుత్వం లేదు అందుకే అంటున్నాడు మరణమా నీ విజయమెక్కడ? మరణమా నీ ముల్లెక్కడ? మీరు గమనించారా క్రైస్తవుల్లో ఎవరైనా మరణిస్తే ప్రభువునందు నిద్రించారు, మహిమా ప్రవేశం చేశాడు అంటారు. అంటే ప్రభువు ఉన్నచోటుకి వెళ్ళాడని, నిత్యరాజ్యానికి వారసుడయ్యాడు. ప్రమోషన్ దొరికితే ఎవరు ఏడుస్తారు. విందు చేసుకుంటారు. ప్రమోటెడ్ టు గ్లోరీ అంటారు కదా. అలాగు ప్రభు దగ్గరికి వెళ్ళిపోయారని అర్థం. అందుకే ఎక్కడకూడా క్రైస్తవులకు ఓటమి లేదు. ప్రభువును నమ్మినవారికి విజయం తప్ప, ఓటమి లేదని గ్రహించాలి. అన్నిటిమీద విజయం యిస్తానని సెలవిస్తున్నాడు. అందుకే ఈ లోకంలో పునరుత్థాన మహిమయందు విశ్వాసమున్న మనం, సేవకులమేగాని, విశ్వాసులమే కావచ్చు, క్రైస్తవులే ఉండవచ్చు. మనం దేనికొరకు ప్రయాసపడుతున్నామో, ప్రభువునందు మన ప్రయాసం వ్యర్థంకాదు. అందుకే పౌలు భక్తుడంటున్నాడు **"కాగా నా ప్రియ సహోదరులారా మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థంకాదని యెరిగి, స్థిరులును కదలని వారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి."** – 1 కొరింథీ. 15:58. దేవునికి స్తోత్రం. హల్లెలూయా. ఈ రోజు మనం మరణానికి భయపడం. మనం తిరిగి లేస్తాము. ప్రపంచంలో ఖాళీ సమాధి ఒక్కటే ఉంది. ఇశ్రాయేలు దేశానికి నేను అయ్యగారు వెళ్ళినప్పుడు చూశాను. ఖాళీ సమాధిలో అడుగు పెట్టినప్పుడు నా విశ్వాసం స్థిరపరచబడింది. ఎంతో మంది దేవుళ్లనే పేరుతో వచ్చారు. యుగపురుషులొచ్చారు, ఘనులొచ్చారు వారు మరణించారు కాని తిరిగి లేవలేదండీ. కేవలం యేసుప్రభు మాత్రమే తిరిగి లేచాడు. హల్లెలూయ. ప్రభువే మరణాన్ని గెలిచాడు. ఖాళీ సమాధి సందేశం యిస్తుంది ప్రసంగం చేస్తుంది యేసుప్రభువు యిక్కడ లేడు ఆయన పునరుత్థానుడయ్యాడని. యేసుప్రభుని వెంబడించే నీవుకూడా అదే మార్గంలో ఉన్నావు. నిన్ను ఏ మరణ బంధకం బంధించలేదు. **"మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను లేపెను."** – అపొ.కా. 2:24. దేవుడు ఆయనను తిరిగి లేపెను. యేసుప్రభు పేరు సత్యం. సత్యం భూమిలో మొలకెత్తుతుంది. గోధుమగింజ భూమిలో పడి మరణిస్తేగాని అది ఫలించదు కదా. అలాగే యేసులో జీవముంది. యేసులో సత్యం ఉంది. ఆ సత్యాన్ని భూమిలో పాతి పెట్టినా మూడవరోజు అది మొలకెత్తుతుంది. అదే పునరుత్థానం. ఆ దినాల్లో సద్దూకయ్యులు పునరుత్థానం అంటే నమ్మలేదట. నమ్మకుంటే పునరుత్థాన శక్తికి ఏమైనా తక్కువవుతుందా? నమ్మినవాడు రక్షించబడతాడు. నమ్మనివారికి శిక్షవిధించబడుతుంది. పునరుత్థాన మహిమలో నమ్మకముంచాలి.

యేసుక్రీస్తు పునరుత్థానం కాకుంటే మన విశ్వాసమంతా వ్యర్థమైపోయేది. **"లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపములనిమిత్తము మృతి పొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను".** – 1 కొరింథీ. 15:3,4. లేఖనముల ప్రవచనాల నెరవేర్పు మనం క్రొత్త నిబంధనలో చూస్తున్నాం. **"క్రీస్తు లేపబడనియెడల మీ విశ్వాసము వ్యర్థమే. మీరింకను మీ పాపములోనే యున్నారు."** – 1 కొరింథీ. 15:17. **"మనుష్యునిద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యునిద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను."** – 1 కొరింథీ. 15:21. **"ఈ జీవిత కాలముమట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించు వారమైనయెడల మనుష్యులందరికంటే దౌర్భాగ్యులమై యుందుము.** –1 కొరింథీ. 15:19 పునరుత్థానము సంఘానికి కీలకమైన సందేశము. పునరుత్థాన బలమే సంఘానికి పునాది. సంఘము జన్మించిందే పునరుత్థానముతో. పరిశుద్ధాత్ముడు దిగివచ్చినదీ పునరుత్థానముతోనే. పునరుత్థానం లేకుంటే మన విశ్వాసము వ్యర్థము. మన సువార్త ప్రకటన వ్యర్థము. పునరుత్థానము లేకుంటే సేవకులంతా చెప్పేవి అబద్ధసాక్ష్యాలే. పునరుత్థానము లేకుంటే సువార్త సంపూర్ణమైనది కాదు.

మన నిరీక్షణ కేవలం పునరుత్థాన సత్యం పైన ఆధారపడి ఉంది. పునరుత్థానం లేకుంటే మనము పాపక్షమాపణ పొందియున్నామనే నమ్మకము లేదు. పునరుత్థానము లేకుంటే నిత్యజీవితం ఉంటుందనే నిరీక్షణ లేకుండా ఉంటుంది. విశ్వాసులమైన మనం క్రీస్తు రెండవ రాకడను నమ్ముతున్నాం. ఈ రెండవ రాకడ నిరీక్షణ మనకు యేసు పునరుత్థానముద్వారానే కలిగింది. పరిశుద్ధాత్మ అనే సత్యం కేవలం పునరుత్థానంద్వారానే కలిగింది. లేకుంటే ఆత్మగల వారెవరు? ఆత్మలేని వారెవరు? ఏ తారతమ్యం ఉండదు కదా. అందుకే మన జీవితాలు ఈ లోకసంబంధంగా కేవలం తినడం, త్రాగడం, చనిపోవడం అది జంతువుల లాగా మృగ సమానం. కాని యేసుని ధరించిన మనం అలాకాక మనం చనిపోయినా మనం తిరిగి బ్రతుకుతాం. మనకు ఒక గొప్ప నిరీక్షణ, మన దేహాలు మట్టిపాలైనా మన్నైనది మట్టిపాలైనా ఆత్మ తిరిగి దేవునియొద్దకే వెళ్తుంది. మరి నీతిమంతులకు పునరుత్థానం, మృతుల పునరుత్థానం. రెండు పునరుత్థానములని వాక్యంలో ఉంది. ఈ రెంటిటికి తారతమ్యం ఉంది. కేవలం యేసుప్రభువు వాగ్దానమిచ్చినట్లు నేనుండు స్థలంలో నేను మిమ్మును చేర్చుకుంటాను అన్నట్లు వ్రాయబడి ఉంది. మనం పునరుత్థాన మహిమలు ధ్యానిస్తున్నప్పుడు పరిశుద్ధాత్ముడు మనలను శక్తితో నింపుతాడు. మరణం అంటే భయంలేదు. కేవలం పునరుత్థాన బలంద్వారా విశ్వాసి అన్నిటిపైన విజయం పొందుతున్నాడు అందుకే విశ్వాసి పునరుత్థాన ప్రాముఖ్యత గ్రహించాలి. పరిశుద్ధ జీవితం జీవిస్తున్నామంటే, పరిశుద్ధత కలిగి ఉన్నామంటే, పాపానికి దూరంగా ఉన్నావంటే సాతాను స్వరానికి లోబడకుండా ఉన్నావంటే, ఆత్మకు లోబడి ఆత్మ నియంత్రణలో ఉన్నావంటే కేవలం అది పునరుత్థాన మహిమ. మార్కు సువార్త 16 లో స్త్రీలు సుగంధద్రవ్యాలు తీసికొని యేసుప్రభు శవ శరీరానికి పూయడానికి వెళ్తున్నప్పుడు వారికి ఒక అనుమానం వచ్చింది. (అక్కడ వారి సాంప్రదాయం ప్రకారం శవాన్ని నారబట్ట (ప్రేత వస్త్రాలతో) చుట్టి బండతో తొలిపించిన సమాధియందు పెట్టి ఆ సమాధి ముఖద్వారమునకు పెద్దరాతిని పొర్లించి కావలి వారినుంచుతారు.) మగ్దలేనే మరియ, యాకోబు తల్లియైన మరియయు, సలోమేయు సూర్యోదయమైనప్పుడు సమాధి వద్దకు వచ్చుచుండగా, సమాధి ద్వారమునుండి మనకొరకు ఆ రాయి ఎవరు పొర్లించునని ఒకరితో ఒకరు మనం బలహీనులం, అబలలం అని చెప్పుకొనుచూ వెళ్తుండగా అక్కడ వారు ఆ రాయి పొర్లియుండుట చూశారు. అక్కడ గొప్ప మహిమను చూశారు అదే గొప్ప పునరుత్థాన బలం. పునరుత్థాన మహిమ.

ఈ రోజు మీ జీవితంలో ఆటంకాలు, అడ్డుబండలు ఉన్నాయా? మీ మార్గంలో ఉన్న అడ్డుబండలను తొలగించడానికి పునరుత్థాన శక్తి చాలినదని మీకు జ్ఞాపకం చేస్తున్నాను. దేవునికి స్తోత్రం. పునరుత్థానంలో గొప్పబలం, గొప్ప శక్తి ఉంది. నీ బ్రతుకు దినములన్నియు యే మనుష్యుడు నీయెదుట నిలువ నేరడు. అదే క్రొత్త నిబంధనలో యేసుప్రభువు సదా నీకు తోడైయున్నాడు. నీకు ఆయనపై ఉన్న ప్రేమ తొలగించడానికి ఏ శక్తికి సాధ్యంకాదు. కనుక దేవుని బిడ్డలారా, మన హృదయాలు పునఃప్రతిష్ఠించుకొని యేసుప్రభు బలియాగమందు విశ్వాసముంచాలి. సిలువనుగూర్చిన వార్త నశించుచున్నవారికి వెఱ్ఱితనము, రక్షింపబడుచున్న వారికి దేవుని శక్తియై ఉంది. అలాగే పునరుత్థానములో గొప్ప మహిమ, బలము ఉంది. సంఘానికి పునాది పునరుత్థానము. ఆ పునరుత్థానములో మనం విశ్వాసముంచి, మనం ఎదుర్కొంటున్న ఆందోళన, అలజడి, అసమాధానం, భయం అడ్డుబండలన్నీ తొలగించడానికి యేసుయొక్క పునరుత్థాన శక్తి చాలినదని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆమేన్.



జాయ్ చెరియన్

# దేవుని సహస్రనామములు

## 357. ప్రకాశమానమైన వేకువ చుక్క – ప్రకటన 22:16

**"సంఘములకోసము ఈ సంగతులనుగూర్చి మీకు సాక్ష్యమిచ్చుటకు యేసు అను నేను నా దూతను పంపియున్నాను. నేను దావీదు వేరుచిగురును సంతానమును, ప్రకాశమానమైన వేకువ చుక్కయునై యున్నాను."**
– ప్రకటన 22:16

ప్రకాశమానమైన వేకువ చుక్కయని ఆయన నామము. ఎవరైతే భయంకరమైన పాపముతో నిండి కారుచీకటి దట్టముగా కమ్ముకున్న బ్రతుకులు కలిగి యేసు ప్రభువును రక్షకుడిగా అంగీకరిస్తారో అప్పుడు వారి జీవితములలో ఈ ప్రకాశమానమైన వేకువచుక్క ఉదయిస్తుంది. చీకటి బ్రతుకులు వెలుగుతో నింపబడతాయి.

రాత్రంతా చీకటి, తరువాత వేకువనే సూర్యోదయమైనప్పుడు చీకటిని చీల్చుకుంటు వెలుగు ఉదయిస్తుంది. ఈ ప్రకాశమానమైన వేకువ చుక్క ఉదయించినప్పుడు ఆ అరుణోదయ దర్శనము ఎంత మనోహరముగా చూడటానికి ఎంతో ఆహ్లాదముగా ఉంటుంది. ఈ ప్రకాశము లేకుండా ఎప్పుడూ చీకటి ఉంటే జీవరాసులు బ్రదుకలేవు. అదే విధముగా యేసుప్రభువనే ప్రకాశమానమైన వేకువ చుక్క నీ చీకటి బ్రతుకులో ఉదయించినప్పుడు పాపపు అంధకారము తొలగిపోయి జీవపువెలుగుతో నిండిపోతావు.

**"నక్షత్రము యాకోబులో ఉదయించును. రాజదండము ఇశ్రాయేలులోనుండి లేచును."** – సంఖ్యాకాం. 24:17

ఈ నక్షత్రము యేసుప్రభువే. మన సంఘములో రక్షింపబడిన గంగాధర్ గృహము దర్శించాను. 1997లో గంగాధర్ రక్షింపబడ్డాడు. భయంకరమైన త్రాగుబోతు, దుర్మార్గుడు, అక్రమముతో నిండినవాడు. అతడిని చూస్తే అందరూ భయపడేవారు. వారి కుటుంబములో సమాధానము లేదు. అంతా చీకటిమయముగా ఉంది. 1997 సంవత్సరములో దేవుని దాసురాలిగా వారి గృహములో అడుగుపెట్టి ప్రార్థించాను. చాలా చిన్న గృహము. దాని నిండుగా విగ్రహాలు. దేవుని దాసురాలిగా అతనిని రక్షించమని ప్రార్థించాను. దేవుడు అద్భుతము చేశాడు. భయంకరమైన పాపిని మార్చేశాడు. అతడు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందాడు. అతడు మారడము చూచి వారి బంధుమిత్రులు దాదాపుగా 50–60 మంది రక్షింపబడ్డారు. ఇప్పుడు గంగాధర్ పూర్తిగా మారిపోయాడు. పాపి పరిశుద్ధుడయ్యాడు. అతని చీకటి బ్రతుకులో ప్రకాశమానమైన వేకువ చుక్క ఉదయించింది. ఇప్పుడు వారి గృహములో ఎంత సంతోషము, సమాధానము దేవుని ప్రకాశముతో నిండుకొని ఉంది. గంగాధర్ రక్షింపబడక ముందు వారి కుటుంబస్థితి, రక్షింపబడిన తరువాత వారి కుటుంబ పరిస్థితి గమనిస్తే ఎంతో వ్యత్యాసము కనిపిస్తుంది. దేవుడు వారిని ఇప్పుడు ఎంతో దీవించాడు. ముందు చిన్న గృహము. ఇంట్లో నీళ్లు సరిగా ఉండేవి కావు. కాని ఇప్పుడు విశాలమైన గృహములో ఉంటున్నారు. సమృద్ధియైన ఆహారము, సమృద్ధియైన నీళ్లు ఇచ్చి దేవుడు వారిని తృప్తిపరచాడు. ప్రభువు వారి జీవితములనే మార్చివేశాడు. గంగాధర్ ఇప్పుడు భార్యా బిడ్డలతోకలసి ఎంతో సంతోషముతో ఉన్నాడు. రక్షింపబడక ముందు గంగాధర్ ఇంటికి వస్తున్నాడంటే భార్యాబిడ్డలు భయముతో వణికిపోయేవారు. పిల్లలైతే తండ్రికి కనబడకుండ దాక్కొనేవారు. ఆ వీధిలోనివారుకూడ అతడు వస్తున్నాడంటే భయపడి తలుపులు వేసుకొనేవారు. అలాంటివాడిని ప్రభువు ఎంతగానో మార్చివేశాడు. ఎవడైనను యేసుక్రీస్తునందున్నయెడల వాడు నూతనసృష్టి. ఇప్పుడు భార్య, బిడ్డలతోకలసి సంతోషముగా కాలక్షేపము చేస్తున్నాడు. పిల్లలతో సమయము గడుపుతున్నాడు. ఇప్పుడు అతనికి యేసుప్రభువునుగూర్చి చాటించాలని అతనిలాంటి త్రాగు బోతులను, దుర్మార్గులను, లంచగొండులను మార్చాలని ఆశ. అటువంటి శక్తి పొందునట్లు అతనికొరకు సంఘమంతా ప్రార్థించాలని కోరుతున్నాడు.

**"ప్రకాశమానమైన వేకువ చుక్క"** అనే నామము ధ్యానించినప్పుడు నీ చీకటి బ్రతుకును వెలిగించమని ప్రార్థించు. నీ రోత బ్రతుకును మార్చివేస్తాడు. నిన్ను తన వెలుగుతో నింపి అనేకులను వెలిగించడానికి తన మహిమార్థమై వాడుకుంటాడు. ఆయన లోకమునకు వెలుగైయున్నాడు. కనుక ఆయనను అనుసరించువారు ఇంక చీకటిలో నడువక వెలుగులో నడుచుకుంటారు. ఆయన సిలువ మరణముద్వారా చీకటి, రోగము, పాపము, శాపము, దాస్యము, భయము తొలగిపోయింది. ప్రకాశమానమైన వేకువ చుక్క నీ జీవితములో ఉదయిస్తుంది. నీకెప్పుడయినా భయము కలిగినప్పుడు ప్రభువా, నీవు ప్రకాశమానమైన వేకువ చుక్కవు. నా జీవితములో చీకటి తొలగించి వెలుగుతో నింపుమని ప్రార్థించాలి.

## 358. ఫలము దయచేయువాడు – హెబ్రీ. 11:6

**"విశ్వాసములేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా."** – హెబ్రీ. 11:6

**"ఫలము దయచేయువాడు"** అను నామము ధ్యానించినప్పుడు నాకెంతో సంతృప్తి కలిగింది. ప్రభువునందు నా ప్రయాసము వ్యర్థము కాదని, ప్రభువు ఫలము దయచేయువాడని ధ్యానించి ఎంతో సంతోషించాను. మనము చేసే ఏ ప్రార్థనలు నిష్ఫలము కావు. ఆయన **ఫలము దయచేయువాడు.** కొన్ని సంవత్సరములనుండి నా కుటుంబముకొరకు ప్రార్థిస్తున్నాను; జవాబు రావడములేదని చింతిస్తున్నావా? 40 రోజులు ఉపవాసముతో ప్రార్థించాను; నాకేలాంటి జవాబు రాలేదని అనుకుంటున్నావా? నీవు చింతించకు, భయపడకు. ఆయన **ఫలము దయచేయువాడు.**

ప్రతి ఆదివారము ఆరాధనకు నిష్టగా వెళుతున్నాను. నా అప్పులు తీరే మార్గము కనిపించడములేదని విచారించకు. దేవుని ఘనపరచేవారిని తప్పకుండ దేవుడు ఘనపరుస్తాడు; నిశ్చయముగా ఫలము దయచేస్తాడు. ఎన్నో సంవత్సరములనుండి అవిరామముగా దేవుని సేవ చేస్తున్నాను. నన్నెవరూ గుర్తించడములేదని బాధపడుతున్నావా? నీవేమి క్రుంగిపోనవసరము లేదు. ఆయన తప్పకుండ నీకు ఫలము దయచేస్తాడు. ఆయన భూప్రజలందరికంటే నిన్ను హెచ్చిస్తాడు.

తగిన కాలమందు ఆయన నిన్ను హెచ్చించునట్లు ఆయన బలమైన రెక్కల క్రింద దీనమనస్సు కలిగియుండు. వెయ్యి నామములు ధ్యానిస్తే నాకేమి లభిస్తుంది అనుకుంటున్నావా? తన నామము నెరిగినవారిని ఆయన ఘనపరుస్తాడు. ప్రతి రోజు ఉదయము 4 గంటలకే లేచి అనేకులకొరకు విజ్ఞాపన చేస్తున్నావా? తప్పకుండ నీకు ఫలముంది. రహస్యమందు చూచుచున్న నీ తండ్రి నీకు ప్రతిఫలమిస్తాడు. 40 రోజులు సిలువ ధ్యానములకు వస్తే నాకేమి లాభము అనుకుంటున్నావా? ఆయన సిలువ శ్రమలు జ్ఞాపకము చేసికోవడము ఆశీర్వాదకరము. తప్పకుండ నీకు ఫలము లభిస్తుంది.

**"కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి."** – 1 కొరింథీ. 15:58

ప్రభువునందు మన ప్రయాసము వ్యర్థము కాదని యెరిగి స్థిరులు, కదలనివారుగా, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పుడు ఆసక్తి కలిగియుండాలి. ప్రభువును నమ్ముకొని నిందలు, అవమానములు సహిస్తున్నావా? ఇరుకులు ఇబ్బందులెదుర్కొంటున్నావా? నీవేమి కలవరపడకు. ఆయనయొద్దకు వచ్చువారిని ఆయన త్రోసివేయడు. ఆయనను ఆశ్రయించే ప్రతి ఒక్కరికి ఫలము దయచేస్తాడు. ఆయనయొద్దకు వచ్చువారు ఆయన ఉన్నాడని తన్ను వెదకువారికి **ఫలము దయచేయువాడని** నమ్మాలి. నీ విశ్వాసయాత్రలో ఆగిపోక సాగిపోవాలి. తగిన కాలమందు నీ క్రియలకు తగిన ఫలము తప్పక దయచేస్తాడు.

## 359. తగులు రాయి – యెషయా 8:14

**"సైన్యములకధిపతియగు యెహోవాయే పరిశుద్ధుడనుకొనుడి. మీరు భయపడవలసినవాడు ఆయనే, ఆయన కోసరమే దిగులుపడవలెను. అప్పుడాయన మీకు పరిశుద్ధస్థలముగా నుండును. అయితే ఆయన ఇశ్రాయేలుయొక్క రెండు కుటుంబములకు తగులు రాయిగాను అభ్యంతరము కలిగించు బండగాను**

**ఉండును. యెరూషలేము నివాసులకు బోనుగాను చిక్కువలగాను ఉండును. అనేకులు వాటికి తగిలి తొట్రిల్లుచు పడి కాళ్లు చేతులు విరిగి చిక్కుబడి పట్టబడుదురు."** – యెషయా 8:13-15

**'తగులు రాయి'** అని ఆయన నామము. ఆయన అవిధేయులైనవారికి తగులు రాయిగా ఉంటాడు. ఇశ్రాయేలు ప్రజలు ఎంతగా దేవుని ప్రేమను పొందుతున్నారో అంతగా అవిధేయత చూపిస్తున్నారు. ఎంతగా దేవుని కృపను పొందుతున్నారో అంతగా కృతజ్ఞత లేనివారుగా ఉన్నారు. అందుకే సైన్యములకధిపతియైన యెహోవా ఇలాగు సెలవిస్తున్నాడు. మీరు నా కృపను నిరర్ధకము చేస్తున్నారు. నేననుగ్రహించిన ఆశీర్వాదములు వ్యర్థము చేస్తున్నారు. మీరు వేటికొరకు భయపడుతున్నారో. కాని మీరు భయపడవలసింది మీ దేవుడైన యెహోవాను బట్టియే. నేడు మీరు సత్యదేవుని వదిలి మూగ విగ్రహములను, అన్యదేవతలను పూజిస్తు మనుష్యుల తట్టు మీ హృదయములు త్రిప్పుకుంటే నేను మీకు తగులు రాయిగా, అభ్యంతరము కలిగించు బండగా మారిపోతానంటున్నాడు. ఈ నామము ధ్యానించినప్పుడు మనకు దైవభయము కలగాలి. కొన్నిసార్లు దేవుడు తోడుగా ఉంటాడు అని విశ్వాసి అజాగ్రత్తగా, నిర్లక్ష్యముగా, ధైర్యముగా, దైవభయము లేకుండా తప్పులు చేస్తుంటాడు. ఏమి చేసినా దేవుడు క్షమిస్తాడని అనుకుంటారు. కాని దేవుడు క్షమించగలడు, శిక్షించగలడు అనే సంగతి మరచిపోతారు. విధేయులైనవారికి ఆయన మూలరాయి, అమూల్యమైన రాయిగా ఉంటాడు. ఎప్పుడయితే దేవునికి అవిధేయులవుతామో మూలరాయియే మీకు తగులు రాయిగా మారిపోతుంది.

దేవుని వాక్యము వింటున్నకొలది, చదువుతున్నకొలది మన ప్రవర్తన మారిపోవాలి. దేవుని వాక్యము చాకలివాని సబ్బు వంటిది. సబ్బు ఏవిధముగా బట్టల మీదున్న మురికిని తొలగిస్తుందో అలాగే దేవుని వాక్యము మిమ్మును పవిత్రులుగా చేస్తుంది. కాని ఇశ్రాయేలు ప్రజలు దేవుని వాక్యము తెలుసుకొనేకొలది దేవునికవిధేయులవుతున్నారు. సాతానుకు బానిసలైపోతున్నారు. వారు దేవునికంటే ఎక్కువగా పరిస్థితులకు భయపడుతున్నారు. దేవునిపై విశ్వాసము తొలగించుకొని సాతానుకు భయపడుతున్నారు. జీవముగల దేవుని వదలి మనుష్యులను, మూగ విగ్రహములను తమకు ఆశ్రయముగా చేసికుంటున్నారు. అందుకే దేవుడు వారికి తగులు రాయిగా మారిపోతున్నాడు. అవిధేయులు తగులు రాయికి తగిలి తొట్రిల్లి పడి కాళ్లు చేతులు విరగగొట్టుకొంటున్నారు. వారి మార్గము గాఢాంధకారమైపోయి వారు దేనిమీద పడుతున్నారో వారికే తెలియని స్థితి ఏర్పడుతుంది.

**"భక్తిహీనుల మార్గము గాఢాంధకారమయము తాము దేనిమీద పడునది వారికి తెలియదు."** – సామెతలు 4:19

దైవభయము లేకుండా భక్తిహీనులుగా అయిపోయేవారికి ఆయన తగులు రాయి అయిపోతాడు. నాశనకరమైన గుంటలోనుండి జిగటగల దొంగ ఊబి నుండి నిన్ను పైకెత్తి క్రీస్తనే రక్షణ బండమీద నిలిపాడు. ఎప్పుడయితే నీవు దేవునికి అవిధేయుడవై దేవుని మార్గములోనుండి వైదొలగుతావో అప్పుడు ఈ రక్షణబండే నీకు తగులు రాయిగా మారుతుంది. కొందరు పేరుకు విశ్వాసులే కాని రంగు రంగు రాళ్ల ఉంగరాలు ధరిస్తారు. ఎందుకంటే శని తొలగిపోయి అదృష్టము కలసి వస్తుందని, గ్రహాలు అనుకూలిస్తే చేసే పనులు సఫలమవుతాయని సృష్టికర్తను మరచి సృష్టిని ఆశ్రయిస్తారు. అట్టివారు గుడికి వస్తూనే ఉంటారు; దేవుని వాక్యము వింటూనే ఉంటారు; నామములు ధ్యానిస్తూనే ఉంటారు; కాని వారికి దేవునిపై విశ్వాసముకంటే రంగురాళ్లమీద విశ్వాసము ఎక్కువగా ఉంది. అయ్యో, అట్టివారికి శ్రమ అని వాక్యము బోధిస్తుంది. మూలరాయి, అమూల్యమైన రాయి అయిన యేసుక్రీస్తునుండి దృష్టిని మరల్చుకొని రంగు రాళ్లమీద దృష్టి నిలుపుతున్నారు. అవి ధరిస్తే వ్యాపారములో లాభము వస్తుందట. సమస్య రాగానే మంత్రగాళ్లను, శకునగాండ్రను ఆశ్రయిస్తున్నారు. సమస్య రాగానే ప్రభువు సన్నిధిలో మోకరించడము కన్న వ్యర్థమైన దానిని అనుసరించడమే మిన్న అనుకుంటున్నారు. వారు స్వశక్తిమీద ఆధారపడుతున్నారు. ఎంత వెఱ్ఱివారు. దేవుడు ఒక్కమాట సెలవిస్తే నీకు కలిగినవన్ని నష్టపోతావు జాగ్రత్త! అట్టివారికి దేవుడు తగులు రాయిగా, అభ్యంతరము కలిగించు బండగా మారిపోతాడు. వారి మార్గమంతా అంధకారమయమవుతుంది. వాక్యము చదువుతున్నవారిలో ఎవరైనా ఇలాంటి వారుంటే, విశ్వాస భ్రష్టులుగా అయిపోతుంటే ఇది మంచి సమయం. దేవుని వాక్యము మీయొద్దకు వచ్చింది. మీరు పశ్చాత్తాపముతో ప్రార్థించండి. ప్రభువా, మూలరాయి, అమూల్యమైనరాయి అయిన నిన్ను విసర్జించి పనికిరాని ఈ రాళ్లతట్టు తిరిగాము. విశ్వాస మార్గములోనుండి అవిశ్వాసులుగా మారిపోయాము. జీవజలముల ఊటయైన నిన్ను విసర్జించి బ్రద్దలైన తొట్లను ఆశ్రయించాము. ప్రభువా, నన్ను క్షమించు. నాకు మూలరాయివి నీవే. క్రీస్తనే బండమీద నా పాదములు నిలిపావు. రక్షణగీతము నా నోటి కందించావు. నేను నిన్నే ఆశ్రయించాలి. నీయందే నమ్మకముంచాలి. నన్ను కనికరించి సహాయము చేయుమని ప్రార్థిస్తే దేవుడు తప్పకుండ కనికరిస్తాడు.

భక్తులు ఎవరో, భక్తిహీనులు ఎవరో, విశ్వాసులు ఎవరో, అవిశ్వాసులు ఎవరో పరిశుద్ధ గ్రంథములో స్పష్టముగా ఉంది. దేవుని వాక్యము అద్దము లాంటిది. దేవుని వాక్యమనే అద్దములో నిన్ను చూచుకున్నప్పుడు నీలోని బలహీనతలు, అవకతవకలు, మచ్చలు, ముడతలు అన్నీ స్పష్టముగా కనబడతాయి. దేవుని వాక్యపు వెలుగులో నిన్ను నీవు సరిచేసికోవాలి. భక్తిహీనులు ఎటువంటివారో కీర్తనకారుడు వర్ణిస్తున్నాడు. దేవునాశ్రయించేవారు భక్తులు. భక్తిహీనుల క్షేమము చూచి మత్సరపడరాదు. భక్తిహీనులు పుష్టిగా ఉన్నారు. వారికే యాతనలు లేవు. నేను భక్తిగా ఉండటము వ్యర్థమే అనుకుంటారు. కాని చివరకు దేవుడు భక్తిహీనులను నిశ్చయముగా కాలు జారు చోటనే ఉంచుతాడని తెలుస్తుంది.

**"భక్తిహీనుల క్షేమము నా కంటబడినప్పుడు గర్వించువారినిబట్టి నేను మత్సరపడితిని. మరణమందు వారికి యాతనలు లేవు. వారు పుష్టిగా నున్నారు. ఇతరులకు కలుగు ఇబ్బందులు వారికి కలుగవు. ఇతరులకు పుట్టునట్లు వారికి తెగులు పుట్టదు. కావున గర్వము కంఠహారమువలె వారిని చుట్టుకొనుచున్నది. వస్త్రమువలె వారు బలాత్కారము ధరించుకొందురు. క్రొవ్వుచేత వారి కన్నులు మెరకలై యున్నవి. వారి హృదయాలోచనలు బయటికి కానవచ్చుచున్నవి. ఎగతాళి చేయుచు బలాత్కారముచేత జరుగు కీడునుగూర్చి వారు మాటలాడుదురు గర్వముగా మాటలాడుదురు. ఆకాశముతట్టు వారు ముఖము ఎత్తుదురు. వారి నాలుక భూసంచారము చేయును. వారి జనము వారి పక్షము చేరును. వారు జలపానము సమృద్ధిగా చేయుదురు. – దేవుడు ఎట్లు తెలిసికొనును మహోన్నతునికి తెలివియున్నదా? అని వారనుకొందురు. ఇదిగో ఇట్టివారు భక్తిహీనులు. వీరు ఎల్లప్పుడు నిశ్చింతగలవారై ధనవృద్ధి చేసికొందురు. నా హృదయమును నేను శుద్ధిచేసికొని యుండుట వ్యర్థమే. నా చేతులు కడుగుకొని నిర్మలుడనై యుండుట వ్యర్థమే. దినమంతయు నాకు బాధ కలుగుచున్నది. ప్రతి ఉదయమున నాకు శిక్ష వచ్చుచున్నది. –ఈలాగు ముచ్చటింతునని నేననుకొనినయెడల నేను నీ కుమారుల వంశమును మోసపుచ్చినవాడనగుదును. అయినను దీనిని తెలిసికొన వలెనని ఆలోచించినప్పుడు నేను దేవుని పరిశుద్ధ స్థలములోనికి పోయి వారి అంతమునుగూర్చి ధ్యానించువరకు ఆ సంగతి నాకు ఆయాసకరముగా ఉండెను. నిశ్చయముగా నీవు వారిని కాలుజారు చోటనే ఉంచియున్నావు. వారు నశించునట్లు వారిని పడవేయుచున్నావు. క్షణమాత్రములోనే వారు పాడై పోవుదురు. మహాభయముచేత వారు కడముట్ట నశించుదురు."** – కీర్తనలు 73:3-19

దేవుని బిడ్డలు, భక్తులు శ్రమల కొలిమిలోనే తయారవుతారు. బంగారమును శుద్ధీకరించడానికి అగ్నిలో వేస్తారు. అలాగే భక్తులకు శ్రమలు వారిని పరిశుద్ధపరచడానికే, కాని శ్రమలలో దేవుడు వారికి తోడుగా ఉంటాడు. భక్తిహీనులకు ఎలాంటి యాతనలు ఉండవు. ఎందుకంటే దేవునికి వారు అవసరము లేదు. భక్తులకు, ప్రార్థన చేసేవారికి కన్నీళ్లు, దుఃఖము, బాధ కలుగుతుంటే భక్తిహీనులు పుష్టిగా ఉన్నారు. భక్తులు శ్రమలద్వారా విధేయత నేర్చుకుంటున్నారు. దేవుని ఆశ్రయించి దైవశక్తిని పొందుతున్నారు. భక్తులకు ఆయన మూలరాయిగా ఉంటాడు కాని భక్తిహీనులకు తగులు రాయిగా మారిపోతాడు. క్షణమాత్రములోనే పాడైపోయి నశించిపోతారు.

నీవు **'తగులు రాయి'** అనే దేవుని నామము ధ్యానించావు. నీవు దైవ భయము కలిగి భక్తునిగా దేవుని చిత్తానుసారముగా నడుస్తూ ఆయనను మూలరాయిగా స్వీకరిస్తావా? లేకుంటే దేవుని కవిధేయుడవై దైవభయము లేకుండా దేవుని ఆజ్ఞలు మీరి ప్రభువును తగులు రాయిగా చేసికొని తూలి తొట్రిల్లుతావా? తీర్మానము చేసికో. దేవుని వాక్యము చదివితే, వింటే సరిపోదు. దానిని అనుసరించి మన జీవితములు, ప్రవర్తన సరిచేసికోవాలి.

# దేవుని వెయ్యి వాగ్దానములు

## 160. నేను నా కృపను చూపక మానను.

– 1 దినవృ. 17:13

**"నేను అతనికి తండ్రినైయుండును, అతడు నాకు కుమారుడై యుండును; నీకంటె ముందుగా ఉన్నవానికి నా కృపను నేను చూపక మానినట్లు అతనికి నేను నా కృపను చూపక మానను."** – 1 దినవృ. 17:13. దేవుని కృప మనకు ఎల్లవేళల అవసరము. అయితే ఈ లోకములో ఎవరికి దేవుని కృప లభిస్తుంది? దేవునియందు భయభక్తులు గలవారికి ఆయన కృప లభిస్తుంది. దేవునియందు భయభక్తులు గలవారే ఆయన ఆజ్ఞలు, కట్టడలు గైకొంటారు. **"భూమికంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయనయందు భయభక్తులు గలవారియెడల ఆయన కృప అంత అధికముగా ఉన్నది."** – కీర్తనలు 103:11. దేవుని కృప ఉన్నందుకే నీవు దైవసన్నిధికి రాగలుగుచున్నావు; ఆహారము తిని తృప్తి నొందుచున్నావు; నీ కాళ్లపై నీవు నిలబడుచున్నావు. నీవు హాస్పిటల్ పాలు కాకుండా, ప్రమాదాలకు గురై మృతిచెందకుండా దేవుని కృప నిన్ను కాపాడుతుంది. నేను ఒకరోజు గాంధీ హాస్పిటల్ మార్చురీకి వెళ్లాను. మా స్టాఫ్‌లో ఒక సభ్యుని తల్లి రోడ్డు దాటుచుండగా కారు ఢీ కొట్టినందున ఆమె రోడ్డుమీద పడి చనిపోయింది. అతను వారికి ఒక్కడే కుమారుడు. అతనొక ప్యూన్; అతనికి ఏమీ తెలియదు. ఆ శవమును మార్చురీలో వేశారు; అడిగితే వారు నానా ప్రశ్నలడుగుతూ శవాన్ని ఇవ్వడము లేదని విన్నవించుకొన్నాడు. నేనొక కారుతీసికొని అక్కడికి వెళ్లాను. నేను ఆ దృశ్యాన్ని ఎన్నటికీ మరువలేను. పెద్ద హాలులో అనేకమైన గుర్తుపట్టని శవాలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదములో మరణించి గుర్తుతెలియని చిరునామాలేని స్త్రీలు, పురుషులు సూటు బూటు టై ధరించిన ధనవంతుల శవాలు ఎన్నో ఉన్నాయి. మొత్తము దుర్వాసనతో నిండియుంది. ఆలాగు ఆ శవాలను 24 గంటలు ఉంచి సంబంధీకులు దొరకుంటే కాల్చివేస్తారట. కావున మనము లోపలికి వచ్చునప్పుడు, బయటకు వెళ్లునప్పుడు దేవుని స్తుతించాలి. నీ రాకపోకల్లో ఆయన నిన్ను కాపాడాలి. నీవు ఏదైనా కార్యము తలపెట్టునప్పుడు దేవుని కృపను వేడాలి.

**"భక్తిహీనులకు అనేక వేదనలు కలుగుచున్నవి యెహోవాయందు నమ్మికయుంచువానిని కృప ఆవరించుచున్నది."** – కీర్తనలు 32:10. దేవుడు మనచుట్టు తన కృప కంచె వేస్తాడు. దేవుని కృప ఎక్కడ దొరుకుతుంది? **"యెహోవా యొద్ద కృప దొరుకును."** – కీర్తనలు 130:7. మనకు మనపిల్లలకు మన కుటుంబాలకు దేవుని కృప కావాలి. దేవుని కృపలేకుంటే మనము మన జీవితాల్లో ముందుకు సాగలేము. ఒకసారి వార్తపత్రికల్లో ఒక వార్త ఈలాగు ఉంది. ఇద్దరు మహిళా అడ్వకేట్లు ఒక కేసు వాదించడానికి వెళ్తుండగా మార్గంలో ఎవరో వారిని హత్యచేసి పడేశారు. వారిలో ఒకామె పాదాలకు పారాణీ ఆరలేదు. అనగా ఆమె వివాహము జరిగి మూడు నెలలుకూడా పూర్తికాలేదు. కాని ఆమె తన ప్రాణాన్ని కోల్పోయింది. **"తనకు ప్రార్థన చేయువారందరియెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడైయున్నాడు."** – రోమా 10:12. ఆయన తన పరిపూర్ణతలోనుండి మనకు కృప వెంబడి కృప అనుగ్రహిస్తున్నాడు (యోహాను 1:16). నీవు బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే నీవెంట వస్తాయి. చెట్టుకు మంచులోదున్నట్లు తన బిడ్డలకు తన కృప తోడుంటుంది. అందుకే మనము పచ్చగా కనబడతాము. అన్యజనులందరు మనలను ధన్యులు అంటారు. మనము దేవునివలన కృప పొందినవారము. **"దూత – మరియా, భయపడకుము; దేవునివలన నీవు కృపపొందితివి."** – లూకా. 1:30. దేవుడు నన్ను ఈ వాగ్దానముతో బలపరచాడు. అనేకమైన బాధలు, కత్తిపోటువంటి మాటలు, ఒక స్త్రీగా నిలబడి సంఘాన్ని నడిపించడము ఎంతో కష్టము. అయినను నాకు భయము లేదు. ఎన్ని అవరోధములు ఎదురైనా పూలగంపలో పడినట్టు దేవుని కృపలో పడతాను. ఆయన పరిపూర్ణతలోనుండి కృప వెంబడి కృప పొందుటకు దేవుడు సహాయం చేస్తున్నాడు. కృప దేవుని ఉచితమైన వరము. ఈ కృప కావాలంటే నీవు దేవునియందు భయభక్తులు నిలపాలి. తెలిసి తెలిసి ఏ పాపము చేయకూడదు. అప్పుడు కృప నష్టమౌతుంది. కృపలేని వానిగా దిక్కుమాలిన దరిద్రుడవౌతావు. కావున దైవభయము కలిగి పాపాన్ని వదిలి పరిశుద్ధ జీవితము జీవించాలి. ఏమీలేదు, ఇది కృపాకాలం, ఎన్ని పాపాలు చేసినా దేవుడు కృప చూపుతాడని అనుకోకు. ఆయన యూదా గోత్రపు కొదమ సింహము. గొఱ్ఱెపిల్లగా లోకానికి వచ్చింది నీకొరకు బలి అవుటకు కాని నిన్ను శిక్షించుటకు ఆయన వెనుకాడడు. కావున కృప నష్టము చేసికోవద్దు. పౌలు భక్తుడు – నా దేహములో ముల్లు తొలగించమని ముమ్మారు ప్రార్థించాడు. కాని దేవుడు నా కృప నీకు చాలును అంటాడు (2 కొరింథీ 2:9). నీకు శ్రమ, దుఃఖం, బాధలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా దేవుడు తన కృపను ఎడముచేయడు. దేవుడు నీకు తన కృప చూపక మానడు.

## 161. గొడ్రాలు ఏడుగురు పిల్లలను కనును.

– 1 సమూయేలు 2:5

**"తృప్తిగా భుజించినవారు అన్నము కావలెనని కూలికి పోవుదురు ఆకలి గొనినవారు ఆకలితీర తిందురు గొడ్రాలు ఏడుగురు పిల్లలను కనును అనేకమైన పిల్లలను కనినది కృశించిపోవును."** – 1 సమూయేలు 2:5. గొడ్రాలు ఏడుగురు పిల్లలను కనును అనేది ఒక వాగ్దానము. మాకెందుకులే, మేము కడుపునిండా పిల్లలను కన్నాము. ఈ వాగ్దానము మాకెందుకు అనుకోకండి. నీవు స్త్రీవైనా, పురుషుడవైనా దేవునికొరకు ఆత్మలను సంపాదించకుంటే నీవు గొడ్రాలువే. నీవు ఆత్మలో అనేకమందిని కనాలి. ఒక ఆత్మనైనా దైవసన్నిధికి నడిపించాలి. అంద్రెయ పేతురుని యేసుప్రభువు వద్దకు నడిపించాడు. పేతురు లోకాన్ని తలక్రిందులు చేశాడు. నీవు ఒక ఆత్మను రక్షించినప్పుడు వారు భక్తులై లోకానికి మండుతూ ప్రకాశించే దీపముగా మారిపోతారు. ఆలాగు మీరు వానిని కనినట్టే. మీరు వారిని నడిపించారు; వారిద్వారా లోకము వెలిగింపబడితే ఆ ఘనత, కృప, దీవెనలన్నీ అతని దేవునియొద్దకు నడిపించిన వ్యక్తికే చెందుతాయి. నేను ఆత్మలో కనిన పిల్లలు లెక్కకు మించినది.

శారీరకంగాకూడా ఇది సత్యమే. గొడ్రాలిని చూస్తే లోకము ముక్కు విరుచుకుంటుంది. ఆ..., ఎంతుంటే ఏమిటి? ఈమెకు సంతానం లేదు అంటారు. సాదారణముగా ఎవరైనా – నీ వద్ద ఎంత డబ్బు ఉంది, నీవు ఎన్ని భవంతులు నిర్మించావు అని అడగరు. నిన్ను చూడగానే – నీకు ఎంతమంది పిల్లలు? అని అడుగుతారు. ఒకసారి 45 సంవత్సరాల తల్లి చిన్నబిడ్డను ఎత్తికొని సాక్ష్యము చెప్పింది. ఆమె 45 సంవత్సరాలవరకు గొడ్రాలే. స్త్రీ ధర్మము నిలిచిపోయే ఆ వయస్సులో చంటి బిడ్డతో ఆలయానికి వచ్చింది. దేవుడు యు.పి.ఎఫ్. సంఘ ప్రార్థనలు విని ఆమె గర్భము తెరచి ఆమెకు గర్భఫలము అనుగ్రహించాడు. పరిశుద్ధ గ్రంథంలో గొడ్రాళ్లు పిల్లలకొరకు ఏడ్చారు, మొఱ్ఱపెట్టారు, పొందారు. దేవుడు ప్రార్థన ఆలకించువాడు. ఆయన చెవియొగ్గి నీ ప్రార్థనలు ఆలకిస్తాడు. శారా గొడ్రాలు; దేవుని వాగ్దానము పొంది తన వృద్ధాప్యమందు కుమారుని కన్నది. రిబ్కా గొడ్రాలు; రిబ్కాకొరకు తన భర్త ఇస్సాకు ప్రార్థించాడు. ఇదొక గమ్మత్తు. సాధారణముగా గొడ్రాలైనా హన్నా, రాహేలు మొఱ్ఱ పెట్టుకొన్నారు. **"ఇస్సాకు భార్య గొడ్రాలు గనుక అతడు ఆమె విషయమై యెహోవాను వేడుకొనెను. యెహోవా అతని ప్రార్థన వినెను గనుక అతని భార్యయైన రిబ్కా గర్భవతి ఆయెను."** – ఆదికాం. 25:21. భర్తలు భార్యలకొరకు ప్రార్థించడము ఎంత అదృష్టము. ఎప్పుడూ నా భర్తను మార్చు, నా భర్తను కాపాడు అని భార్యలే ప్రార్థించాలా? నా భార్యను భక్తురాలిగా చేయి, నా భార్యకు సంతానము ఇవ్వు, నా భర్యను ధన్యురాలిగా చేయి అని భర్తలు ప్రార్థిస్తే దేవుడు ఎంతగా దీవిస్తాడో! ప్రార్థించే భర్తలు ఉన్నవారు ఎంత ధన్యులు. చాలా మంది పురుషులు ప్రార్థించేది మావంతు కాదు అనుకొంటారు. రోదించే స్త్రీలు, అంగలార్చే స్త్రీలు, తెలివిగల స్త్రీలను పిలిపించు, లేచి రేయి మొదటిజామున పిల్లలకొరకు ప్రార్థించమని స్త్రీలకే చెప్పాడనకుండా పురుషులు ప్రార్థిస్తే ఇంకా దీవింపబడతాము. ఇస్సాకు ప్రార్థిస్తే రిబ్కా దీవింపబడి పిల్లలను కన్నది.

గొర్రెలు ఏడుగురు పిల్లలను కంటుంది. ఈ రోజు నీకు పిల్లలు లేకుంటే ఆయన నీ మొఱ్ఱ వినేవరకు నీవు ఆయనను వదిలిపెట్టొద్దు. యాకోబు పెనుగులాడినట్టు పెనుగులాడాలి. నీవు నన్ను దీవించేవరకు నేను నిన్ను విడువనని నాకు సంతానము కావాలని అడగాలి. పరిశుద్ధ గ్రంథములో ఉన్న ఏ వాగ్దానము నెరవేరక మానదు కదా! గొర్రెలు ఏడుగురు పిల్లలను కంటుందా? ప్రార్థన చేసి ఈ కాలంలో ఏడుగురు పుడితే నేనెలా పెంచాలని నీవు అనుకోకు. ఒక్కరుంటే చాలని అనుకొంటున్నావా? దేవుడు నీవు అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా ఇస్తాడు. హన్నా మందిరానికి వచ్చి – నీవు నాకు ఒక్క కుమారుని దయచేయి; నాకు కుమారుని ఇస్తే నేను తిరిగి నీకే ఇస్తాను అని ప్రార్థించినప్పుడు దేవుడు ఆమె ఆరుగురి పిల్లలను కనేలాగున ఆశీర్వదించాడు. ఆమె అడిగింది ఒక్కటే కాని పొందింది అధికము.

## 162. నీతిమంతుడు విశ్వాసము మూలముగ బ్రదుకును.

– హబక్కూకు 2:4

**"వారు యథార్థపరులు కాక తమలో తాము అతిశయపడుదురు; అయితే నీతిమంతుడు విశ్వాసము మూలముగ బ్రదుకును."** – హబక్కూకు 2:4

నీతిమంతులు విశ్వాసము మూలముగా బ్రతుకుతారు. వారు వెలిచూపువలన కాదు, చూస్తేనే నమ్మేవారు కాదు; చూడకుండా దేవుని నమ్ముతారు. అవిశ్వాసియైన తోమా – మీరు ప్రభువును చూశారంటే నేను నమ్మను; నేనూ ప్రభువును చూడాలి; ఆయన గాయాల్లో నేను నా వ్రేలుపెట్టి చూడాలి; నిజంగా సిలువవేయబడిన క్రీస్తు పునరుత్థానుడయ్యాడనేది నేను చూస్తే గాని నమ్మను అంటాడు. అప్పుడు ప్రభువు అవిశ్వాసియైన తోమాను బలపరుస్తాడు. నీలో ఉన్న అవిశ్వాసమును తొలగించమని ప్రభువును అడిగితే ఆయన సిద్ధముగా ఉంటాడు. ప్రభువా – నేను అల్పవిశ్వాసిని, అవిశ్వాసిని, నాకు విశ్వాసము అంతగా లేదు, నా విశ్వాసమును వృద్ధి చేయుమని అడిగితే ప్రభువు నీ విశ్వాసాన్ని వృద్ధి చేస్తాడు. ప్రభువు అవిశ్వాసియైన తోమాకు ప్రత్యక్షమై తన గాయాలు చూపి–ఇప్పటికైనా విశ్వసించు; చూచి నమ్మినవానికంటే చూడక నమ్మినవారు ధన్యులు; నీవు అవిశ్వాసివికాక విశ్వాసివై ఉండు అంటాడు. నీతిమంతులు విశ్వాసముద్వారా బ్రతుకుతారు. నీకు రోగము వచ్చినా, నీపై నిందలు పడినా, వేదనలు కలిగినా, ఆర్థిక ఇబ్బందులు నిన్ను వెంటాడినా – నేను విశ్వసించిన ప్రభువు నన్ను పతనము చేయడని ప్రతి అడుగు విశ్వాసము మూలమున వేయాలి. నీ నీతి నీ ముందర నడుస్తుంది.

పేతురు ప్రభువును చూసి అలలమీద నడిచాడు. ప్రభువును చూచినంత మట్టుకు పేతురు అలలమీద నడిచినట్టు నీవు విశ్వాసంతో నడవాలి. అలలు నిన్ను ముంచి వేయడానికే వచ్చినవి కాని నీవు అలలమీద నడుస్తావు. తొమ్మిది ఆత్మవరాల్లో విశ్వాసమనేది గొప్పవరము. భాషలు మాట్లాడడము అందరికీ ఇష్టము. నీవు నీ గది తలుపు వేసికొని భాషలు దేవునితో మాట్లాడి ఆనందించుట కొరకు, కాని విశ్వాసమనే వరము లోకమును జయించునది. భాషలు మాట్లాడాలన్నా, అద్భుతాలు చేయాలన్నా, స్వస్థపరచాలన్నా, రాబోవు కాలమునుగూర్చి ప్రవచించాలన్నా, వివేచించాలన్నా, బుద్ధివాక్యం జ్ఞానవాక్యం ప్రకటించాలన్నా దేవుడు నీతో మాట్లాడుతున్నాడనే విశ్వాసము కావాలి. నీవు ప్రార్థన చేస్తున్నప్పుడు నీ మనవి ఆలకిస్తున్నాడనే విశ్వాసము నీకు ఉండాలి.

**"విశ్వాసమనునది నిరీక్షింపబడువాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునైయున్నది."** – హెబ్రీ 11:1. నీవు దేనికొరకైతే ప్రార్థిస్తున్నావో అది పొందియున్నామని విశ్వసించాలి. అదే దేవుని నీతి. అబ్రాహాము దేవుని నమ్మెను; అది అతనికి నీతి అని యెంచబడెను. అందుకే అతడు నీతిమంతునిగా తీర్చబడి విశ్వాసము మూలముగా జీవించాడు. అనేక సంవత్సరములనుండి నేను ఎక్కడైనా విశాలమైన స్థలాలకు వెళ్లినప్పుడు దేవుని మాటను జ్ఞాపకము చేసికొంటాను. 30, 50 ఎకరాల స్థలంలో సేవ జరిగే చోట్లకు వెళ్లినప్పుడు, జింఖానా గ్రౌండ్‌కు వెళ్లినప్పుడు నేను ఒక్కసారి చుట్టూ పారజూస్తాను. దేవుడు తన భక్తుల కన్నులతో నిబంధన చేస్తాడు; చూచినది అనుగ్రహిస్తాడు. నీవు ఎంతమేరకు చూడగలుగుతావో చూడు, అంతా నీకు ఇస్తాను అన్నాడు.

నీలో ఎంత విశ్వాసము ఉంది? ఒక వ్యక్తి మారుమనస్సు పొందాలంటే నీవు ఎటువంటి అనుమానము కలిగిఉండవద్దు. పరిస్థితులు తారుమారయ్యే పరిస్థితి వచ్చినా – నేను నమ్మినవానిని నేనెరుగుదును గనుక నేను సిగ్గుపడను; ఆయన నా తల యెత్తుతాడు; నాకు ఓటమి కలుగదు, జయశాలి నా చేతులు పట్టుకొని యున్నాడని అచంచలమైన విశ్వాసము కలిగి ఉండాలి. నీవు ఒక వ్యక్తికొరకు ప్రార్థన చేస్తున్నప్పుడు అతడు భక్తుడుగా మారాలని ఆశిస్తే నీవు విశ్వాసముతో అతన్ని భక్తునిగానే చూడాలి. నీ పిల్లలు భక్తులు కావాలని ఆశిస్తే వారికొరకు ఆహారము సిద్ధపరచునప్పుడు, సేవలు అందించునప్పుడు అన్నివేళల ప్రార్థిస్తూ విశ్వసించాలి. తలిదండ్రుల విశ్వాసము వారి పిల్లలను పైకి తీసికొని వస్తుంది. కొందరు వారి నోటి ఫలముచేత పిల్లలను అణగద్రొక్కుతారు. పిల్లలు అలాగే కుప్పకూలిపోతారు. కీడు, నాశనము సంభవిస్తుంది. జీవమరణములు నాలుక వశము. కావున విశ్వాసపు మాటలు పలకాలి. నీతిమంతులు విశ్వాసము మూలమున బ్రతుకుతారు. వారి నోటికి కీడు, పాడు అను మాటలు రావు. దేవుడు ఉన్నాడు; మనకు సహాయము చేస్తాడు; ఇప్పుడు నా స్థితి కొద్దిగా ఉన్నా తుదకు నేను మహాభివృద్ధి నొందుతాను; మన పరిస్థితులు మారిపోతాయి; ఇప్పుడు పుచ్చుకొంటున్న మనము ఇచ్చేవారిమి అవుతామని విశ్వాసపు మాటలు మాట్లాడుతారు. **"విశ్వాసములేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను గదా."** – హెబ్రీ 11:6. ఫలము దయచేయువాడని దేవుని పేరు. నీవు ప్రార్థించినప్పుడు ఆయన నీ ప్రార్థనకు తగిన ఫలము అనుగ్రహిస్తాడు.

ఒక తల్లికి ఒక్కడే కుమారుడు; ఆమె విధవరాలు; ఆమె – అమ్మా, నేను ప్రభువును నమ్ముకొన్నాను; నేను ఎన్నో అవమానములు, ఇబ్బందులు, దెబ్బలు ఎదుర్కొన్నాను కాని ఇప్పుడు నా కొడుకు ఎదిగాడు అతనికి వివాహము చేయాలి; నాకు దేవుని విశ్వసించిన అమ్మాయి కోడలిగా రావాలని మందిరానికి వచ్చి ప్రార్థించుకొన్నది. అతనికి వివాహమైన తర్వాత అతని భార్యను చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆమె ఎంతో నిష్ణాతురాలిగా ఇంగ్లిష్ మాట్లాడుతుంది, మంచి విశ్వాసముకలిగియుంది. ఆలాగు నీవు విశ్వాసముద్వారా నీ కుటుంబానికి దీవెనలు రాబట్టుకొంటావు. విశ్వాసమనేది ఒక బొక్కెన. నీవు దేవుని ఊటల్లోనుండి నీకు కావలసినవి చేదుకొంటావు. కొందరియొద్ద త్రాడు మాత్రమే ఉంటుంది గాని బొక్కెన ఉండదు. బావి చాలా లోతుగా ఉంది; 30 మీటర్ల త్రాడు వేశాము; చాలా త్రాడు దించాము గాని చుక్క నీరు రాలేదు అంటారు. వారు దానికి బొక్కెన తగిలించలేదు గనుక ఏమీ పొందలేదు. ఆయన జీవపు ఊటల్లోనుండి జ్ఞానము, పరిశుద్ధత, ధైర్యసాహసాలు, నీతి, కృప, దీవెనలు విశ్వాసముతో చేదుకో. దేవుని భక్తులు విశ్వాసముతో దేవునియొద్దనుండి అనేక కార్యాలు పొందారు. **"వారు విశ్వాసముద్వారా రాజ్యములను జయించిరి; నీతికార్యములను జరిగించిరి; వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్లను మూసిరి; అగ్ని బలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి; బలహీనులుగా ఉండి బలపరచబడిరి; యుద్ధములో పరాక్రమశాలులైరి; అన్యుల సేనలను పారదోలిరి."** – హెబ్రీ 11:33–34. హెబ్రీ పత్రిక 11వ అధ్యాయము ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుసార్లు చదవండి. తిరిగి విశ్వాసములో బలపరచబడతారు. నీతిమంతులు విశ్వాసము మూలముగా జీవిస్తారు. కావున నీవు అవిశ్వాసపు మాటలు మాట్లాడేవారితో విశ్వాసులతో సాంగత్యము ఉంచు అని హెచ్చరించు; అయినా మారకపోతే వారితో సాంగత్యము మానివేయి. ఎందుకంటే విశ్వాసమైనా, అవిశ్వాసమైనా ఒకరినుండి ఒకరికి అంటుకొంటుంది. నీవు బలముగా ఉంటే నీ విశ్వాసము ఇతరులకు అంటుకొంటుంది; నీవు బలహీనంగా ఉంటే వారి అవిశ్వాసము నీకు అంటుకొంటుంది. కావున అవిశ్వాసులతో జోడు కలిగిఉండొద్దని పరిశుద్ధ గ్రంథము బోధిస్తుంది. నీతో కలసి ప్రార్థించేవారిలో ఎవరికైనా అవిశ్వాసముంటే వారిని దూరము పెట్టాలి. ఏక మనస్సు ఏక విశ్వాసము కలిగి ఉన్నప్పుడే ఆ ప్రార్థన బలముగా ఉంటుంది. బలహీనమైన విశ్వాసము కలిగి ఉన్నవారు, విశ్వాసముతో ఎదగనివారిని మాత్రము త్రోసివేయవద్దు. వారిని విశ్వాసములో బలపరచాలి.

చాలా సంవత్సరాలక్రితం విశ్వాసియైన ఒక స్త్రీ రొమ్ముక్యాన్సర్‌తో బాధపడుతుండడము నేను కన్నులారా చూశాను. ఆమె ఎంతో బరువు పెరిగిపోయి, రంగుమారిపోయి కొండలాగ తయారైపోయింది. నేను ఆమెతో –నీవు హాస్పిటల్‌కు వెళ్లావా? అంటే నేను వెళ్లనమ్మా, నేను దేవుని వాగ్దానాలను నమ్ముకొని ఉంటాను;

నేను నమ్మినవానిని నేనెరుగుదును; దేవుడు నన్ను బాగు చేస్తే బాగు చేయనీ, నేను నా దేహాన్ని కత్తికి అప్పగించను; ఒకవేళ చనిపోతే ఈలాగే చనిపోతాను; దేవునిలో ఆనందిస్తూ ప్రభువు వద్దకు వెళ్తానని అనింది. ఆమె మాటలు నన్ను కదిలించాయి. నేను ఇప్పుడు దేవుని పాటలు పాడుతున్నాను. దేవుని వాగ్దానము ధ్యానిస్తున్నానని చెప్పింది. బాధపడుతున్నను దేవునిలో ఆనందిస్తుంది. కొందరు వారి సర్వశరీరముకు ఆరోగ్యమున్నను దేవుని ధ్యానము చేయరు. దేహములో రోగముండి, కొన్నాళ్లలో చనిపోతావని తెలిసికూడా పాటలు పాడడము గొప్పది కాదా? నీతిమంతుడు విశ్వాసము మూలముగా బ్రతుకుతాడు. దేవుడ ఒక గొప్ప అద్భుతమే జరిగిస్తే క్యాన్సర్ నయమౌతుంది. దేవునికి సమస్తము సాధ్యము అనేది ఆమె విశ్వాసము ఆలాగు ఆమె విశ్వాసముతో బ్రతుకుతుంది. రేడియో థెరపీ, కీమో థెరపీని మించినది ఆయన నామము. ఆయన దహించు అగ్నియైన దేవుడు. మరొక స్త్రీకి కడుపులో కణితి వచ్చింది. డాక్టర్లు ఆమె రెండు నెలలు మాత్రమే బ్రతుకుతుంది అన్నారు. కాలాన్ని నిర్ణయించేది దేవుడే. విశ్వాసియైన ఆ స్త్రీ రెండు నెలలు కాదు ఇరవై సంవత్సరాలుగా జీవించే ఉంది. ఆ కణితి విస్తరించలేదు; అప్పుడు ఎంత ఉందో ఇప్పటికీ అంతే ఉందట. ఆమె ఎప్పుడూ దేవుని కీర్తిస్తూ, వాక్యమును ధ్యానిస్తూ విశ్వాసములో బలపడుతుంది. దేవుడు మనకు శత్రువు బలమంతటిమీద అధికారమిచ్చాడు; ఏదియు మనకు ఎంతమాత్రమును హాని చేయదు. ఆలాగు నీవు విశ్వాసముద్వారా జీవించాలి.

నీ సమస్యకు పరిష్కారము రానప్పుడు నీ చుట్టున్నవారు వచ్చి – నీ దేవుడేమాయెను అని అడుగుతారు. నీతిమంతుడు విశ్వాసము మూలమున బ్రతుకుతాడు తప్పకుండా నేను ప్రార్థించేకార్యాలు జరుగుతాయని విశ్వాసముతో, ధైర్యముతో చెప్పాలి. ❁

## సంపూర్ణ రాత్రి ప్రార్థన

**ప్రతినెల చివరి బుధవారము**

**రాత్రి 9 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు**

**సెంటినరి బాప్టిస్టు చర్చి, సికింద్రాబాద్‌లో జరుగును.**

### యు.పి.ఎఫ్. కార్యక్రమములు

1. **ఆదివార ఉదయకాల ఆరాధన :** ప్రతి ఆదివారము ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు
   **సండే స్కూల్ :** ప్రతి ఆదివారము ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు మరియు సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు (Zoom) లో
   **సాయంకాల ఆరాధన :**
   **ఇంగ్లీష్ సర్వీస్:** ప్రతి ఆదివారము సా॥ 4 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు (Zoom లో)
   **సండే స్కూల్ :** సా॥ 4 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు
   **తెలుగు ఆరాధన:** ప్రతి ఆదివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు
2. **365 రోజులు ఉదయకాల ప్రార్థనలు :** ప్రతిరోజు ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ల వరకు
3. **యౌవనస్థులకొరకు ప్రత్యేక ప్రార్థనలు :** సోమవారము నుండి శనివారము వరకు మ॥ 2 గం॥ల నుండి 3 గం॥ల వరకు
4. **తల్లుల సహవాసము, మెన్స్ ఫెలోషిప్ & మండే స్కూలు :** ప్రతి సోమవారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు
5. **24 × 7 ఎడతెగని ప్రార్థనలు** (Zoom లో)
6. **యూత్ మీటింగ్ :** ప్రతి శనివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 8:30 ని॥ల వరకు

**Zoom id : 9550504718 | Passcode : 7777**




"యెడతెగక ప్రార్థన చేయుడి." – 1 థెస్సలో. 5:17

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)** రాంనగర్, హైదరాబాద్ - 500 020.

**నిర్వహించు**

# 24 X 7 నిరంతర ప్రార్థన



దైవ దర్శనంతో రెవ.డా. జాయ్ చెరియన్ గారు 2023 ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభించిన ఈ నిరంతర ప్రార్థన 24 గంటలు రాత్రింబగళ్లు ప్రభువు రాకడ పర్యంతము జూమ్‌ద్వారా కొనసాగింపబడును. మీ ప్రార్థన అవసరతలు తెలియజేసినయెడల ఆ సమయంలో అందుబాటులో ఉన్న కాపరులు, నాయకులు, ప్రార్థనవీరులు మీకొరకు ప్రార్థించెదరు.

**Zoom id : 9550504718 | Passcode : 7777**

*అందరికీ ఆహ్వానము*

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 228. "మీరును శరీరముతో ఉన్నారు గనుక కష్టముల ననుభవించుచున్నవారిని జ్ఞాపకము చేసికొనుడి."

– హెబ్రీ 13:3

మీరును శరీరముతో ఉన్నారు కాబట్టి శరీర బాధలు, రోగము, దెబ్బలు, అవమానము, మానసిక వ్యాధి, కష్టములు అనుభవిస్తున్నవారిని జ్ఞాపకము చేసికోవాలి. దేవుడు మీకు చక్కని ఆరోగ్యము ఇచ్చాడు గనుక శరీరకంగా కృషించినవారిని బలహీనులను జ్ఞాపకము చేసికోవాలి. అంగవైకల్యము, తీరని వ్యాధులు, భయభీతులు, ఆర్థిక ఇబ్బందులు, తినుటకు ఆహారంలేనివారు, వస్త్రహీనులు, బాధల్లో ఉన్నవారినిగూర్చి నీవు ఆలోచించాలి. విశ్వాసిగా అది నీ బాధ్యత. అలాంటి పరిస్థితుల్లో నీవు చేయగలిగినంత సహాయం చేయాలి.

**"అయితే దైవదృష్టికి ఇష్టుడగువాని కిచ్చుటకై ప్రయాసపడి పోగుచేయు పనిని ఆయన పాపాత్మునికి నిర్ణయించును."** – ప్రసంగి 2:26

నీతిమంతులు అనుభవించడానికి దేవుడు పాపాత్ములకు కూర్చుకొనే పని అప్పగిస్తాడు. పాపాత్ములు కూడబెట్టి దాన్ని అనుభవించకుండా దాటిపోతారు. అది నీతిమంతుల వశమైపోతుంది. గనుక నీతిమార్గాల్లో నడుస్తూ దేవుడు ఇచ్చేది అనుభవిస్తూ వాటిని లేనివారితో పంచుకోవడం చాలా మంచిది. కొన్ని కార్యాలకొరకు ఉపవసించి ప్రార్థించాలి. నీవు ఎల్లప్పుడు ఆత్మల భారం కలిగిఉండాలి. ఒక వ్యక్తి రోగపడకలో ఉన్నప్పుడు తోటి విశ్వాసిగా తీవ్రత కలిగి ప్రార్థించాలి. మనము యేసుక్రీస్తు శరీరములో అవయవాలుగా ఉన్నాము. శరీరంలో ఒక అవయవానికి గాయమైతే శరీరమంతా ఆ నొప్పి, ప్రభావాన్ని అనుభవిస్తుంది. అలాగు ఎవరికైనా వ్యాధి, రోగం వస్తే నీవు ప్రార్థించాలి. నీవు అలా ప్రార్థిస్తే దేవుడు ఆ ప్రార్థన ఆలకించి ఆ వ్యక్తిని స్వస్థపరుస్తాడు. నా అనుభవముద్వారా చెబుతున్నాను ఇది తప్పకుండా జరుగుతుంది.

**"నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును."** – యాకోబు 5:16

కష్టములనుభవించుచున్నవారికొరకు ప్రార్థించాలి, సహాయము చేయాలి. నీకు సహాయము చేయడానికి స్తోమత లేకుంటే నీవు వారికొరకు ప్రార్థించాలి. దేవుడు నిన్ను అన్నిరీతులుగా ఆశీర్వదిస్తే ఇలా శ్రమపడేవారిని, కష్టాలనుభవించే వారిని జ్ఞాపకము చేసికోవాలి. తలిదండ్రులులేని అనాథలు, విదవరాండ్రు, భర్త సహాయంలేనివారు, కుటుంబాలనుండి వెలివేయబడినవారు, ఏ సహాయం లేకుండా ఉన్నవారు, పరదేశులు, ఒక స్థలంనుండి మరొక స్థలానికి వచ్చి ఏ దిక్కు, ఆధారం లేనివారు ఉంటారు. వారికొరకు ప్రార్థించాలి. దేవుడు నీకు ఇచ్చిన కొలది నీవు సహాయం చేయాలి. విత్తడానికి, కోయడానికి ఓ సమయం ఉంది. విత్తే ప్రతివాడు తప్పక కోత కోస్తాడు. ఒక మంచి కార్యం చేయడం మంచి విత్తనం విత్తడంతో సమానము. విత్తనములో జీవం ఉంటుంది గనుక అది వృద్ధిచెందుతుంది; పెరుగుతుంది. నీవు ఏ విత్తనమైతే విత్తుతావో తప్పక ఆ పంట కోస్తావు. నీవు ఏ కార్యాలైతే చేస్తావో అవి నీకు తిరిగి ప్రతిఫలం ఇస్తాయి గనుక కష్టములు అనుభవించుచున్న నీ తోటివారిని తప్పక జ్ఞాపకముంచుకొని వారికి తగిన సహాయము చేయుటకు వెనకాడకూడదు.

## 229. "ధనాపేక్షలేనివారై మీకు కలిగిన వాటితో తృప్తిపొంది యుండుడి."

– హెబ్రీ 13:5

తృప్తి అనేది చాలా గొప్పవరము. ఇది చాలా మందికి ఉండదు. దేవుడు ఎంతగా దీవించినా, వారి జీవితంలో ఎంతగా దైవాశీర్వాదములు అనుభవించినా తృప్తి చెందరు. కాబట్టే వారు క్రుంగుదలలో ఉంటారు. వ్యసనం, బాధ, భయం, దుఃఖం వారిని వెన్నంటి ఉంటాయి. సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనం అని; ధనాశ సమస్త కీడునకు మూలమని వాక్యము తెలియజేస్తుంది. కావున విశ్వాసులు ధనాపేక్షలేనివారై ఉండాలి. నీ దృష్టి ధనంమీద కాక దేవునిమీద ఉండాలి. దేవుడే నిన్ను దీవిస్తాడు. గనుక నీకు కలిగిన వాటితో నీవు తృప్తిగా ఉండాలి. దేవుడు నీకు ఇచ్చినవాటికొరకు దేవుని స్తుతించడం మరచిపోవద్దు.

కొందరు లేనివాటికొరకు అసంతృప్తిని బయల్పరుస్తూ సణిగి, సంశయించి కుటుంబాన్ని పతనంలోకి నడిపిస్తుంటారు. అది దేవునికి ఇష్టమైనది కాదు. కలిగినవాటితో తృప్తి కలిగి ఉండాలని ఈ ఆదేశం తెలియజేస్తుంది. **"సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్పలాభసాధనమై యున్నది. మనమీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొంది యుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులకు నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్షసమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి."** – 1 తిమోతి 6:6-10

మనము ధనాపేక్షలేనివారమై కలిగిన దానితో తృప్తికలిగి ఉండాలి. ఉన్నవాటితో తృప్తికలిగి ఉండడమనేది ఎంతో గొప్ప విషయం. అంతేగాని ఉన్నవాటిని అనుభవించకుండ లేనివాటికొరకు వెదకులాడటం సరికాదు. దేవుడు నిన్ను క్రమక్రమముగా ఆశీర్వదిస్తాడు. దేవుడు అబ్రాహాము కుమారుడైన ఇస్సాకును క్రమక్రమముగా ఆశీర్వదించాడు. కాని అలాగాక ఇప్పుడే చుక్కలంటుకోవాలంటే ఎలా? దేవుడు ఆయన పద్ధతుల్లో నిన్ను దీవిస్తాడు. ఇస్సాకు విత్తనము వేసి నూరంతల ఫలం పొందాడు.

**"ఇస్సాకు ఆ దేశమందున్నవాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలముపొందెను. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక ఆ మనుష్యుడు గొప్పవాడాయెను. అతడు మిక్కిలి గొప్పవాడగువరకు క్రమక్రమముగా అభివృద్ధిపొందుచు వచ్చెను. అతనికి గొఱ్ఱెల ఆస్తియు గొడ్ల ఆస్తియు దాసులు గొప్ప సమూహమును కలిగినందున ఫిలిష్తీయులు అతనియందు అసూయపడిరి."** – ఆదికాం. 26:12-14

ఇతరులు చూచి ఆశ్చర్యపోయేరీతిగా, నివ్వెరపోయేరీతిగా దేవుడు ఇస్సాకును ఆశీర్వదించాడు. ఇది దేవుడు దీవించే విధానం.

**"యెహోవా ఆశీర్వాదము ఐశ్వర్యమిచ్చును నరుల కష్టముచేత ఆ యాశీర్వాదము ఎక్కువకాదు."** – సామెతలు 10:22

యెహోవా ఆశీర్వదిస్తే అది ఐశ్వర్యము. నీ శ్రమచేత ఆశీర్వాదం ఎక్కువకాదు గనుక నీవు దేవునిపై ఆధారపడాలి. **"నాకు కొదువ కలిగినందున నేనీలాగు చెప్పుటలేదు; నేనేస్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొనియున్నాను. దీనస్థితిలో ఉండ నెరుగుదును, సంపన్న స్థితిలో ఉండ నెరుగుదును; ప్రతివిషయములోను అన్ని కార్యములలోను కడుపు నిండియుండుటకును ఆకలిగొనియుండుటకును, సమృద్ధికలిగియుండుటకును లేమిలో ఉండుటకును నేర్చుకొనియున్నాను."** – ఫిలిప్పీ. 4:11-12. తృప్తి అనేది చాలా గొప్పగుణం. నేను ఏ స్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి

కలిగి ఉండ నేర్చుకొనియున్నానని అపొస్తలుడైన పౌలు భక్తుడు అంటున్నాడు. దానిని బట్టే **"నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను."** - ఫిలిప్పీ. 4:13 అని అంటున్నాడు.

**"ఇహమందు ధనవంతులైనవారు గర్విష్టులు కాక, అస్థిరమైన ధనమునందు నమ్మికయుంచక, సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగ దయచేయు దేవునియందే నమ్మికయుంచుడని ఆజ్ఞాపించుము."** - 1 తిమోతి 6:17. కావున నీ నమ్మిక అస్థిరమైన ధనమందు ఉండకూడదు. సమస్తమును ధారాళంగా అనుగ్రహించే దేవునియందు నమ్మికయుంచాలి.

**"భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును."** - మత్తయి 6:19-21

కావున నీవు ధనాపేక్ష లేకుండ నీకు కలిగినవాటితో తృప్తికలిగి సమస్తము ధారాళముగా అనుగ్రహించే దేవునియందు నమ్మిక కలిగియుండాలి.

## 230. "మీకు దేవుని వాక్యము బోధించి, మీపైని నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకము చేసికొని, వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకొనుచు, వారి విశ్వాసమును అనుసరించుడి." - హెబ్రీ 13:7

ఇది విశ్వాసులకొరకు ఇవ్వబడిన ఆదేశము. మీకు దేవుని వాక్యము బోధించినవారు మీ ముందు మీకు మాదిరిగా ఉన్నారు. వారు మీకు నాయకులుగా ఉన్నారు. మీకు ఉపదేశము అందించుచున్నారు. మీరు నడవవలసిన త్రోవను మీకు బోధించుచున్నారు. మీరు వారిని నిర్లక్ష్యము చేయక ఘనపరచాలి; సత్కరించాలి. మీకు కలిగిన వాటిలో శ్రేష్ఠమైనవాటిని ఇవ్వాలి అని వాక్యంలో ఉంది. **"వాక్యోపదేశము పొందువాడు ఉపదేశించు వానికి మంచి పదార్థములన్నిటిలో భాగమియ్యవలెను."** - గలతీ 6:6

మరియు వారి ప్రవర్తన ఫలాన్ని శ్రద్ధగా తలంచాలి. వారి విశ్వాసాన్ని అనుసరించాలని వక్కాడించి చెప్పబడింది. పరిశుద్ధ గ్రంథము నీతిమంతులను జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమని తెలియజేస్తుంది. నీవు దినమంతా ఎన్నెన్నో కార్యాలను జ్ఞాపకమునకు తెచ్చుకుంటావు. అయితే వాక్యము - మీపైని నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకం చేసికోవాలని చెబుతుంది. పరిశుద్ధ గ్రంథములో చాలా మంది భక్తులున్నారు; నిజజీవితంలో చక్కని జీవితం జీవించిన భక్తులున్నారు; వారు ఈనాటికి లోకంలో ఉన్నా, లోకమునుండి దాటిపోయినా వారిని ఒక్కసారి స్మరణకు తెచ్చుకొన్నప్పుడు నీ విశ్వాసం స్థిరపరచబడుతుంది. నీ ప్రవర్తన సరి అవుతుంది. నీవు సరియైన మార్గములో నడవడానికి నీకు అవకాశము కలుగుతుంది. పరిశుద్ధ గ్రంథములో యోబుయొక్క సహనాన్ని జ్ఞాపకము చేసికోవాలని వ్రాయబడి ఉంది. అది ఎంత ఆశీర్వాదకరము!

**"నా సహోదరులారా, ప్రభువు నామమున బోధించిన ప్రవక్తలను, శ్రమానుభవమునకును ఓపికకును మాదిరిగా పెట్టుకొనుడి. సహించినవారిని ధన్యులనుకొనుచున్నాము గదా? మీరు యోబుయొక్క సహనమునుగూర్చి వింటిరి. ఆయన ఎంతో జాలియు కనికరమును గలవాడని మీరు తెలిసికొనియున్నారు."** - యాకోబు 5:10,11

కొన్నిసార్లు శ్రమలు వచ్చినప్పుడు మనము సహనమును కోల్పోతాము. ఒక్కసారి ఆ భక్తుని జ్ఞాపకము చేసికొన్నప్పుడు ధైర్యం కలుగుతుంది. తెలియకుండానే అతనికి ఇచ్చిన సహనం నాకు దయచేయుమని ప్రార్థిస్తాము. అలాగే మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడు, భూజనులందరిలో మిక్కిలి సాత్వికుడు అన్న విషయము జ్ఞాపకము చేసికొన్నప్పుడు నేను సాత్వికంగా ఉండాలి; నమ్మకముగా జీవించాలి; దేవునితో మాట్లాడాలి; నాకు దేవుడు అప్పగించిన పని చక్కగా చేయాలని అనుకుంటాము. ఇలా అనేకమంది భక్తులగురించి వాక్యంలో చూస్తాము. వీరు మనకు మార్గదర్శకులుగా ఉన్నారు. They are trend setters. They are tourch barers. వారు మనకు వెలుగు చూపిస్తున్నారు గనుక మనము వారిని స్మరణకు తెచ్చుకోవాలి.

నోవహు దేవుడు చెప్పిన కార్యాలను, ఇచ్చిన పనులన్నీ చక్కగా నెరవేర్చాడు. నోవహు దేవుని కృపపొందినవాడు. దేవుడు తన కుటుంబాన్నంతటిని రక్షించాడు. అలాగు మనము దేవునికి విధేయులమైనప్పుడు దేవుడు మన కుటుంబాలను రక్షిస్తాడని నమ్మిక కలుగుతుంది; మన విశ్వాసము పెరిగిపోతుంది. హనోకు దేవునితో నడిచినవాడు. మరియు హనోకు మరణము చూడకుండా కొనిపోబడ్డాడు. నీతి మరణమునుండి రక్షిస్తుంది. కావున నీవు నీతి దయచేయుమని, నీతిమంతునిగా తీర్చమని దేవుని ప్రార్థించాలి. దేవునితో నడిచే కృప పొందాలి. దానియేలును సింహపు బోనులో వేసినప్పుడు దానియేలు ఎంత నిబ్బరముగా ఉన్నాడు. దానియేలుకు దినమునకు 3 సార్లు ప్రార్థించే అలవాటు ఉంది. ప్రతిదినం యెరూషలేము తట్టున్న కిటికీలు తెరచి ముమ్మారు మోకరించి ప్రార్థించే అనుభవం ఉన్నందున ప్రార్థిస్తే సింహపు గుహలో పడవేయబడతాడని ఎరిగికూడా ప్రార్థించుట మానలేదు. ప్రభువు అతన్ని కాపాడాడు. అలాగే ఏలీయా మనవంటి స్వభావంగల వ్యక్తే అయినా వర్షింపకుండునట్లు ప్రార్థించగా 3½ సంవత్సరాలు వర్షము కురవలేదు. తర్వాత వర్షం కురవాలని ప్రార్థిస్తే వర్షం కురిసింది. ఏలీయా ప్రార్థించినప్పుడు ఆకాశంనుండి అగ్ని దిగి బలిపీఠంపై ఉన్న జంతువును, బలిపీఠం చుట్టున్న నీటిని దహించివేసింది. **"ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థనచేయగా మూడున్నర సంవత్సరముల వరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థనచేయగా ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను."** - యాకోబు 5:17,18

అదేవిధంగా యోసేపును జ్ఞాపకము చేసుకుంటే ఎంత పవిత్రత కనబడుతుంది. అతను జారత్వానికి దూరముగా పారిపోయాడు. నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందును (ఆదికాం. 39:9) అని అంటాడు. పాపమునకు దూరంగా పారిపోయినందున ఎంతగానో దీవింపబడ్డాడు. ఫరో రాజ్యమంతటికి అధికారి అయ్యాడు. అవును పాపాన్ని ద్వేషించినవారిని దేవుడు దీవిస్తాడు. ఈ విషయాలన్నీ ధ్యానించినప్పుడు మనము ఎంతో విశ్వాసాన్ని పొందుతాము. అలాగే మనకు వాక్యోపదేశము చేసిన భక్తులు అనేకులు మన ముందు ఉన్నారు. కన్నులారా వారిని చూసి వారి క్రియాఫలాన్ని అనుభవిస్తున్నాము. అటువంటి నాయకులు, బోధకులు, విశ్వాసవీరులను నీవు జ్ఞాపకము చేసికోవాలి. ఇలా భక్తులు వెళ్లిన మార్గములో విశ్వాసులు నడుచుకోవడము దేవుని చిత్తము. కావున మీకు వాక్యము బోధించి మీపైని నాయకులుగా ఉండి మీ ఆత్మలను కాయుచున్నవారినికూడా జ్ఞాపకము చేసికొని వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకొనుచు, వారి విశ్వాసమును అనుసరించి నడుచుకొంటే మీకు ఎంతో మేలు కలుగుతుంది.

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. కొత్తపల్లి ఇశ్రాయేల్:** నేను యు.పి.ఎఫ్. వాలంటీర్‌ని. 2022 వ సంవత్సరం మార్చి నెలలో మా అమ్మ అమృతకు కడుపుక్రింద క్రికెట్ బాల్ అంత సైజున్న గడ్డ వచ్చింది. చెయ్యి పెడితే తగిలేది. అయితే మా అమ్మ ఎప్పుడూదానిగూర్చి, లక్షణాలగూర్చి చెప్పలేదు. ఆమెకు అజీర్తివంటి సమస్యలు ఉండేవి. స్త్రీలకు 50 సం॥లు వచ్చేటప్పటికి వాళ్లకు ఉండే ఇబ్బందులేమో అని అనుకొంది. తర్వాత మేము నిర్ధారించుకొన్నది ఏమిటంటే, అది ఏదైనా ఉండనీ ఒక స్కాన్ చేయించాలి అనుకొని స్కానింగ్ చేయించాము. స్కానింగ్‌లో 12 సెంటీమీటర్ల గడ్డ ఉందని తెలిసింది. ఆమె ఆ ఇబ్బందితోనే ఆఫీస్‌కు వెళ్తు మాకు వండి పెడుతూ అన్ని పనులు చేసికొంది. ఆ గడ్డ తనకు చాలా ఇబ్బంది కలిగించినా ఎప్పుడూ చెప్పలేదు. ఇక ఆలస్యం చెయ్యొద్దు, చికిత్స చేయించాలని వైద్యులకు చూపించడం, అమ్మగారికి చూపించి ప్రార్థన చేయించడం చేశాము. తర్వాత డాక్టర్లు ఆ గడ్డ తీసివేయాలన్నారు. అప్పటివరకు ఆమె సంతోషంతోనే ఉంది. ప్రార్థించింది, మాతోపాటు అల్పాహారం తీసికొంది. హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యింది. ఆమెను ఆపరేషన్ థియేటర్‌కు తీసికెళ్లేవరకుకూడా నవ్వుతూ ఉంది. అమ్మగారికి చెబితే అమ్మగారు భారంగా ప్రార్థించారు. ఆపరేషన్ అరగంటలో అయిపోతుందన్నారు కాని ఆపరేషన్ చేస్తున్నప్పుడు డాక్టరు – ఆ గడ్డ గుండెనుండి వచ్చే ప్రధానమైన నరమునకు అత్తుక్కొని ఉంది, ఎంతవరకు వీలైతే అంతవరకు తీద్దాము అన్నారు. అయితే వారు ఆ గడ్డ తీస్తున్న ప్రక్రియలో తెలిసిందేమిటంటే, ఆ గడ్డ చిన్న ప్రేవులను వ్యయం చేసింది. ఇనుముకు తుప్పు పట్టినట్లు చిన్న ప్రేవులు పాడైనవి. డాక్టరు నిర్ధారించి 7 అడుగుల చిన్న ప్రేవులను తొలగించారు. తీసేశాక, పరిస్థితి వివరించి ఇప్పుడు ఇక్కడ ఇది అతికే పరిస్థితి లేదు, ఆమె బ్రతికే అవకాశం లేదు అని చెప్పారు.

ఆ సమయంలో నాకు మాటలురాలేదు. బయటకు వచ్చి జాయ్ చెరియన్ అమ్మగారికి ఫోన్ చేసి పరిస్థితి చెప్పి మాట్లాడలేకపోయాను. ఆపరేషన్ థియేటర్ బయట ఒక్కడినే నిలుచుండిపోయాను. నేను ఏ నిర్ణయం తీసికోవాలో నాకు అర్థం కాలేదు. బ్రతకదు అని చెప్పారు. పది ప్యాకెట్ల రక్తము ఎక్కించారు. అమ్మగారు ప్రార్థించి – ఏమీ భయపడకు, దేవుడు గొప్పవాడని చెప్పారు. డాక్టర్లు మా నాన్నకు పరిస్థితి వివరించినప్పుడు – ఏది ఉత్తమమో అది చేయమని నిర్ణయాన్ని తెలిపాము. వాళ్లు ఎక్కడైతే అతికే అవకాశముందో అక్కడ ప్రయత్నించి సున్నా శాతం నుండి 50 శాతానికి నిరీక్షణ కలిగించారు. మేమైతే ఇక్కడ కుట్లు వేసి ప్రయత్నిస్తాం కాని అతికే అవకాశం మాత్రం చెప్పలేమని CICU లోకి మార్చారు. ఆమె 10 రోజులు అందులోనే ఉంది.

దేవుడు నా విషయంలో ఎంత గొప్పవాడంటే ఆ సమయంలో ఆమెను వెంటిలేటర్‌మీద పెట్టాలన్నారు. కాని అమ్మగారు, సంఘమంతటి ప్రార్థనల వలన ఆమె అప్పుడే లేచింది. వెంటిలేటర్ మీద పెట్టకుండా CICU కి పంపించారు. తర్వాత ఆమె కడుపులోనుండి తీసిన గడ్డను బయాప్సీకి పంపించారు. అక్కడ తెలిసిన విషయమేమంటే అది లోగ్రేడ్ ట్యూమర్ (క్యాన్సర్). దానికి ప్రత్యేకంగా స్టేజ్ అనేది లేదు కాకపోతే డాక్టర్లు మూడవ స్థాయిలో ఉందని చెప్పారు. అప్పుడు ఎందుకు నాకిలా అవుతుందని దైవసన్నిధిలో కూర్చుంటే మాటలు రాలేదు; ఎవరైనా కదిలిస్తే ఏడుపు, కన్నీరు. చాలా కృంగిపోయాను, అటువంటి సమయంలో అమ్మగారు, పాస్టర్లు, వాలంటీర్లు, సంఘము, ప్రతిఒక్కరు – ఏమీకాదని చెప్పారు. అమ్మగారు – సింహములాగా ధైర్యంగా ఉంటూ గొఱ్ఱెపిల్ల మనస్తత్వం కలిగి ఉండాలి, ఏమీ కాదు, దేవుడు మంచి చేస్తాడని చెప్పి ఆమె కోసం చాలా ప్రార్థనలు చేశారు. ఆ గడ్డ క్యాన్సర్ అని తెలిశాక ఆరు కీమోథెరపీలు చేయాలన్నారు అసలే ఆమెకు చిన్న ప్రేవులు తొలగించారు. కావున ఆమె తీసికొన్న ఆహారము ఒంట పట్టడం లేదు. ఇటువంటి స్థితిలో కీమోథెరపి చేస్తే ఆమె శరీరం ఎలా తట్టుకుంటుందో అని నేను కొంచెం ఆలస్యం చేశాను. అదీ రెండు వారములు మాత్రమే. కొంచెం ఆహారం పెడితే ఆరోగ్యం కొంచెం మెరుగవుతుంది. అప్పుడు చేయిద్దామనుకొన్నాము. తర్వాత పెట్‌స్కాన్ చేయిస్తే – మళ్లీ ట్యూమర్ పెరుగుతుంది, రెండు చిన్న ట్యూమర్‌లు వచ్చాయి. అప్పుడు డాక్టరు – మీరు నిర్లక్ష్యం చేస్తే ఒకటి, రెండు నెలల్లోనే ఎంత గడ్డ అయితే తీశామో మరల అంత పెరుగుతుందని చెప్పారు. మేము వెంటనే కిమోథెరపీ ఆరంభించాము. ఆరు కీమోథెరపీలు చేయించాము. వీటిద్వారా ఆమెకు చాలా సమస్యలు వచ్చాయి. తెల్లరక్తకణాలు పడిపోయినవి. దానివలన కొంచెం జలుబు చేసినా ప్రాణహాని కలిగే పరిస్థితి. అటువంటి మార్గంలో వెళ్తున్నప్పటికి దేవుడు ఆమెకు తోడున్నాడు. అంతేకాదు ఆర్థికంగా చెప్పాలంటే ఈ ప్రక్రియ అంతటిలో మేము ఏ ఒక్కరిని డబ్బు సహాయం కావాలని అడగలేదు. దేవుడు గొప్పవాడు. చికిత్స ఖర్చుతో కూడినదైనప్పటికి అన్నివిధాల వాళ్లంతట వాళ్లే వచ్చి సహాయం చేశారు. ఇంకో గొప్ప విషయమేమిటంటే ఆమె బాగుపడింది. 25 కిలోలు తగ్గింది గాని ఆరోగ్యంగా ఉంది. ఇప్పుడు ఆమె తిరిగి తన ఉద్యోగానికి వెళ్తుంది. ఉద్యోగానికి వెళ్తు ఇంట్లో తన పనులన్నీ తానే చేసికొంటుంది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి సంఘానికి నా వందనములు.

**2. భవాని, రాంనగర్:** నేను ఈరోజు సజీవుల లెక్కలో ఉన్నానంటే దేవుని కృప, అమ్మగారు మరియు సంఘ ప్రార్థన. 2022 డిసెంబర్ 18న నేను హాస్పిటల్‌లో ఐ.సి.యు.లో ఉన్నాను. నాకు గొంతు కుడివైపున పెద్ద టి.బి. గడ్డ వచ్చింది. ఆ గడ్డ రోజురోజుకు పెరిగిపోతుంది. నా తెల్లరక్తకణాలన్నీ పడిపోయినవి. రక్తము చాలా తక్కువగా ఉంది. రక్తహీనత కారణంగా నాకు రక్తము ఎక్కించారు. అయినా నమ్మకంలేదు, రెండు మూడు వారములే బ్రతుకుతుంది అని చెప్పారు. మచిలీపట్నం, భీమవరంనుండి బంధువు లందరు నన్ను చూడడానికి వచ్చారు. ఇక ఈమె పని అయిపోయింది అనుకొంటున్నారు. నాకైతే చెప్పడం లేదు కాని నాకు తెలుస్తుంది. నా దగ్గరికి ఎవరైన వస్తే నా కన్నీళ్లతోనే మాట్లాడుతున్నాను. నాకు అసలు చేతకావడం లేదు మా అన్నావదిన వైజాగ్‌నుండి వచ్చి 15 రోజులు నాతోనే ఉన్నారు. ఇక అయిపోయిందని వాళ్లందరు చెప్పుకున్నారట. కాని ఆత్మీయతల్లి రెవ.డా. జాయ్ చెరియన్ గారు మాత్రం – నీవు చావవు, సజీవివై యెహోవా కార్యములను వివరిస్తావని చెప్పి ఎంతో ధైర్యపరచారు. నా కుమారుడు ఒక ఫోటో తీసి అమ్మగారికి పంపించాడు. అమ్మగారు – ప్రతిరోజు దానిపై చేతులుంచి ప్రార్థిస్తున్నాను. భయపడొద్దు, మీ అమ్మలేస్తుంది. వచ్చి సాక్ష్యం చెబుతుందని చెప్పారట. అక్షరాల దేవుడు ఆ మాటను రూఢీపరచాడు. నా ఆరోగ్యం కొంచెం మెరుగైనాక ఆ గడ్డతోనే అమ్మగారి దగ్గరకు వచ్చాను. ఆ రోజు ప్రార్థించి, దహించు అగ్ని అని వ్రాయుమన్నారు; నీకేమీకాదు నీవు మరణించవు, మంచిగా అయిపోతావు అని చెప్పారు. నేను చాలా తగ్గి సగానికి సగం అయ్యాను. ఇప్పుడు నేను పూర్తిగా బాగై ఇంట్లో పనులన్నీ చేసికొంటూ సంఘకార్యక్రమాలకు మానక వస్తున్నాను. అమ్మగారు, సంఘము నాకొరకు ఎంతో భారంగా ప్రార్థించారు. దేవునికి స్తోత్రములు అమ్మగారికి వందనములు.

**3. ఇమ్మానుయేల్ ముదిరాజ్, ఉప్పల్:** నేను కొంతకాలంగా అనారోగ్యతతో ఉంటున్నాను నా కాలు సమస్యకొరకు అమ్మగారితో ఫోన్‌లో ప్రార్థన చేయించుకొన్నాను. బాగుకాదన్న కాలు దేవుని కృపనుబట్టి బాగైపోయింది. నేను యు.పి.ఎఫ్. సిలువధ్యానాల్లో పాల్గొని ఆత్మలో చాలా బలపడ్డాను. అమ్మగారు పరిశుద్ధాత్మ శక్తి శీర్షిక ప్రసంగాలు బోధించేటప్పుడు పరిశుద్ధాత్మ ఒక ఇంధనం అని, బండిలో ఇంధనం ఏలాగో మనము అనుదిన జీవితంలో ఇంధనంవలె పరిశుద్ధాత్మను నింపుకొంటే బలపడతాము అని చెప్పిన అంశం నన్నెంతో బలపరచింది. నేను ప్రతిదానికి దేవుని స్తుతిస్తూ యేసురక్తమును కొనియాడుతూ నా శ్రమలను జయిస్తూ ముందుకు వెళ్తున్నాను. ఈ రోజు నేను చాలా శ్రమలలో ఉన్నప్పటికీ ఆ మాట నన్ను బలపరచింది.

 "దేవుని వాగ్దానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టుగానే యున్నవి." - 2 కొరింథీ 1:20

ఈ రోజు నేను దేవుని సన్నిధిలో నిలబడి సాక్ష్యమిస్తున్నానంటే అది నిజంగా దేవుని కృప. దేవునికి స్తోత్రములు నా కొరకు ప్రార్థించి సహాయము అందించిన అమ్మగారికి నా వందనములు.

**4. వినయ, అల్వాల్:** మార్చి 2023లో నాకు తెలిసిన ఒక సహోదరి ఆమె భర్త గుర్చి సమస్య తెలియజేసింది. నేను 2023, 27 మార్చి నుండి 7 ఏప్రిల్ వరకు యు.పి.ఎఫ్.లో అమ్మగారు జరిగిస్తున్న సిలువధ్యాన కార్యక్రమములు యూట్యూబ్‌లో చూడమని ప్రోత్సహించాను. ఆమె అలాగుననే చూసింది. నాలుగవ రోజున ఆమెకు దర్శనంలో రెవ.డా. జాయ్ చెరియన్ అమ్మగారు కనబడ్డారట. అయితే వ్యాపారవేత అయిన ఆమె భర్తకు ఆకస్మికముగా ఛాతిలో నొప్పివచ్చి నిలబడలేని పరిస్థితిలో వెంటనే వేములవాడ హాస్పిటల్‌కు తీసికెళ్లారు. తర్వాత హైటెక్ సిటీ మెడీకవర్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఆమె ఏడుస్తూ నాకు ఫోన్ చేసింది. మా ఆయన పరిస్థితి ఈలాగు ఉంది; మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారని ఫోన్‌లో చెప్పింది. అమ్మగారు ప్రార్థించిన ప్రార్థన నూనె దేవుని నామముల పుస్తకాలు తీసికొని హాస్పిటల్‌కు వెళ్లాము. అతను ఐ.సి.యు.లో తీవ్రమైన పరిస్థితిలో ఉన్నాడు. అతన్ని పరిశీలనలో పెట్టారు. ప్రార్థన నూనె, దేవుని నామముల పుస్తకము వారికి ఇచ్చి యేసుప్రభువు నామంలో ప్రార్థించాము. దేవుడు కీడు తప్పిస్తాడని చెప్పాము. ఎకో పరీక్షలు అసాధారణం అని వచ్చినవి. రక్తములో పాజిటివ్ అని వచ్చింది. రిపోర్ట్స్, రక్త పరీక్షలు నెగటివ్‌గా వస్తాయి. చిన్న సర్జరీతోనే బాగై పోతాడని చెప్పాము. ఈ ప్రార్థన విన్నపము అమ్మగారికి చెప్పినప్పుడు అమ్మగారు ప్రార్థించారు. దేవుని కృపనుబట్టి కీడు తొలగిపోయింది. సర్జరీ విజయవంతమై ఇంటికి వచ్చారు. అతను సమాధానం నెమ్మదితో ఉన్నాడు. దేవుడు వారి జీవితంలో గొప్పకార్యం చేశాడు. ఆమె తన భర్త చనిపోతాడేమో అని కలత చెందింది గాని అసాధారణంగా ఉన్న రిపోర్ట్స్ అన్నీ దేవుడు సాధారణం చేశాడు.

మరియు నా కుమార్తె, అల్లుడు విదేశాల్లో ఉండి వారి ఉన్నత విద్య కొనసాగిస్తున్నారు. వారి విషయమై అమ్మగారికి ప్రార్థన విన్నపము తెలియజేశాను. అక్కడ ఓపెనింగ్స్ లేవు. అక్కడ విద్య ఖర్చుతో కూడినది. లక్షల రూపాయలు పంపాము, లోన్‌లు తీశాము. కావున ఉద్యోగం కావాలని కోరుకొన్నప్పుడు శూన్యంలో ఆకారం ఏర్పరచే దేవుడు ఓపెనింగ్స్ లేనప్పుడే కుమార్తెకు ఉద్యోగ్యం అనుగ్రహించాడు. వాళ్ల చదువులు పూర్తి అయినవి. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**5. నవనీత, రామంతాపూర్:** దేవుడు అద్భుతముగా నన్ను రక్షించాడు. ప్రభువు కృపనుబట్టి 33 సంIIల నుండి ఒక్క మాత్రకూడా వేసికోకుండా దేవుడు నన్ను కాచి కాపాడుతున్నాడు. దేవునిపై ఆధారపడి జీవించుటకు అలవాటుపడ్డాను. దేవుడు నాకు ఇద్దరు కుమారులను ఇచ్చాడు. మందు వాడకుండా ప్రార్థనద్వారా స్వస్థత కలుగుతుంది. నా పెద్ద కుమారుడు డిగ్రీ రెండవ సంవత్సరము చదువుతూ సి.ఎం.ఎ. (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటిగ్) పరీక్ష వ్రాస్తున్నాడు. నేనెంతో టెన్షన్‌తో ఉన్నాను. రెండు వ్రాయలేనన్నాడు. దేవునికృపనుబట్టి రెండిట్లో మంచి ఫలితాలు పొందాడు. చిన్న కుమారుడు 10వ తరగతి చదువుతున్నాడు. నా భర్తకు అనారోగ్యత కలిగినప్పుడు డాక్టర్లు 24 గంటలే బ్రతుకుతాడని చెప్పారు. కాని దేవుడు అతని ఆయుష్షును పొడిగించాడు. అది జరిగి ఇప్పటికి 17 సంవత్సరాలు అవుతుంది. ఇక్కడి ప్రార్థన ద్వారా మేమందరము ఎన్నో మేళ్లు పొందాము. 24 గంటల నిరంతర జూమ్ ప్రార్థనల్లో అనేకులకొరకు ప్రార్థన విన్నపములు తెలియజేసినప్పుడు సంఘము భారంగా ప్రార్థించారు. కరోనా సమయంలో ఎందరో మన మధ్యనుండి గతించిపోయారు. దేవుడు ఆ సమయంలోకూడా మా కుటుంబానికి కీడు రాకుండా కాపాడాడు. నా భర్తను బాగుచేసి ఆయుష్షు పొడిగించినప్పుడు నేను బాప్తిస్మం తీసికొంటానని దేవునికి ఒడంబడిక చేసికొన్నాను. యు.పి.ఎఫ్.కు వచ్చి బాప్తిస్మం తీసికొని 5 సంవత్సరాలుగా యు.పి.ఎఫ్. సంఘములో కొనసాగుచున్నాను. దేవునికి స్తోత్రములు, అమ్మగారికి వందనములు.

**6. ఉమ జాస్మిన్:** నాకు నడుము నొప్పి వచ్చింది. నేను నరాలకు సంబంధించిన నొప్పి అనుకొన్నాను. ఒకరోజు అమ్మగారితో ప్రార్థన చేయించుకొనుటకు వచ్చి చాలా ఏడ్చాను. నొప్పివలన చాలా దుఃఖంతో ఉన్నాను. ఆ విపరీతమైన నొప్పి నేను భరించలేకపోయాను. నాకు ఎప్పుడు అంత విపరీతమైన నొప్పిరాలేదు. అవిరామముగా ఉన్నాను. అమ్మగారు నాకు ఫోన్‌లో ప్రార్థించారు. నేను డాక్టర్ దగ్గరకు వెళ్లాను; రెండు ఇంజెక్షన్లు వేసినా అస్సలు తగ్గలేదు. వారం రోజుల తర్వాత నా కుమార్తె – డాక్టర్ దగ్గరకు వెళ్లు అని హెచ్చరించింది. అమ్మగారికి ఫోన్ చేస్తే అమ్మగారు ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తున్నావని కోపగించి విశ్రాంతి తీసికొనమని చెప్పి ప్రార్థించారు. డాక్టర్ స్కానింగ్ రిపోర్ట్ చూసి – ఎముకలు అరిగినవని చెప్పారు. పదిరోజులు మందులు వాడాను, నాలుగు రోజులు కుర్చీపై కూర్చొన్నాను. వారు నేలమీద కూర్చోవద్దన్నారు. కాని నాలుగు రోజుల తర్వాత నేను మోకాళ్లపై కూర్చొని స్వస్థపరచమని ప్రార్థించాను. దేవుడు నన్ను స్వస్థపరచాడు. దేవునికి స్తోత్రము. అమ్మగారికి సంఘానికి వందనములు.

**7. రాణి, ఆదోని, కర్నూలు జిల్లా:** నేను టి.వి.లో రెవ.డా. జాయ్ చెరియన్ అమ్మగారి వాక్యం చూసేదాన్ని. 14.02.2021లో యు.పి.ఎఫ్. కార్యక్రమంలో పాల్గొని వెళ్లాను. కరోనా సమయంలో నా భర్తగారి ఊపిరితిత్తులపై కరోనా ప్రభావం పడింది. స్కానింగ్ తీసినప్పుడు 25 శాతం కరోనా సోకింది, బాగవ్వడం కష్టమన్నారు. ఏమి చేయాలో నాకు అర్థం కాలేదు. 20 రోజుల తర్వాత మరల స్కానింగ్‌కు పంపారు. ఏమి చేయాలో తోచక ఏడుస్తూ కూర్చున్నాను. యు.పి.ఎఫ్. నంబర్‌కు ఫోన్ చేసి అమ్మగారు ఎత్తితే బాగుండు అనుకొన్నాను. అనుకోకుండా అమ్మగారు మాట్లాడారు అమ్మగారు ప్రార్థించారు. దేవుని దయవలన నార్మల్ రిపోర్ట్ వచ్చింది. రెండవమారు నాకు ఇంట్లో తలభారము ఎక్కువై క్రుంగిపోయి చనిపోవాలను కొన్నాను. నరకం అనుభవించాను, మరల యు.పి.ఎఫ్.కు ఫోన్ చేశాను. అమ్మగారు ప్రార్థన చేసి 15 నిమిషాలకు దేవుని కృపలో పూర్ణ స్వస్థత లభించింది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**8. దామర శాంసన్, తిమ్మాపూర్, దేవరకొండ:** నేను మారుమూల ప్రాంతములో చెంచువాళ్ల మధ్య సేవ చేస్తాను. 2006వ సంవత్సరంలో సేవ ఆరంభమైంది. ఒక సహోదరునిద్వారా 2006వ సంవత్సరంలో యు.పి.ఎఫ్. సంఘము, అమ్మగారు పరిచయమైనారు. అప్పటినుండి నేను యు.పి.ఎఫ్.తో సహవాసము కలిగియున్నాను. అమ్మగారు నాకు 2010వ సంవత్సరంలో అమ్మగారు ప్రార్థించి నాకు అట్లాస్ సైకిల్ ఇప్పించారు. సైకిల్‌కు ముందు లైట్, వెనక క్యారియర్‌కూడా ఏర్పాటు చేయించి ఆశీర్వదించి పంపారు. పది సంవత్సరాలు సైకిల్‌పై వెళ్లి సేవ చేశాను. నేనెప్పుడూ మా సంఘస్తులను తీసికొని యు.పి.ఎఫ్. కార్యక్రమాలకు రావాలనుకొనేవాన్ని. దేవునికృపనుబట్టి సెంటినరి బాప్టిస్ట్ చర్చ్ సికింద్రాబాద్‌లో అమ్మగారు పునః ప్రారంభం చేసిన సంపూర్ణ రాత్రి ప్రార్థనలో టాటా సుమో బండిలో దాదాపు ఎనిమిది మంది సంఘ సభ్యులను తీసికొని రాగలిగాను. 2020వ సంవత్సరంలో దేవుడు నాకు ఒక టాటా సుమో బండి అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**9. మీనా కుమారి:** నా కుమారుడు శిరీష్‌కొరకు నేను సంఘములో ప్రార్థన విన్నపము ఇచ్చాను. వాడు బాగా తిరుగుతాడు, త్రాగుతాడు. ఇంట్లో ఏవీ పట్టించుకొనేవాడు కాదు. నేను 2014వ సంవత్సరమునుండి యు.పి.ఎఫ్.కు వస్తూ బలపడుచున్నాను. అమ్మగారు, సేవకులు, సంఘము నా కుమారునికొరకు ప్రార్థించారు. దేవుడు అద్భుతకార్యం చేశాడు. నా కుమారుడు త్రాగుడు మానివేశాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**10. ఆశాలత, బేగంపేట:** సంపూర్ణరాత్రి ప్రార్థనలో పెట్టిన ఏ ప్రార్థన అయినా దేవుడు వింటాడనేది నా విశ్వాసం. ఈ విషయమై నేను చాలాసార్లు సాక్ష్యముకూడా పంచుకొన్నాను. నేను 21.3.23 మంగళవారము ప్రభాతవేళ లేచి నా భర్త బ్లడ్ సుగర్ పరీక్షిస్తే 423 ఉంది. నేనెప్పుడూ అంతపెద్ద సంఖ్య

చూడలేదు. ఎంతో ఆశ్చర్యపోయాను. నా భర్త డయబెటిక్. నేను ఆ సంఖ్య చూసి చాలా భయపడిపోయాను. అన్ని హాస్పిటల్స్‌కు ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ అడుగుతున్నాను. అయితే 22.3.23 బుధవారము ఆశతో దేవునివైపు చూస్తూ దేవా, నా భర్తకు సుగర్ ఉంది. అది తగ్గించుటకు డాక్టర్ల అపాయింట్‌మెంట్ దొరకట్లేదు, డాక్టర్లకే నీవు పెద్ద డాక్టర్‌వి, నా భర్తను స్వస్థపరచు, 28.3.23 చివరి బుధవారము సంపూర్ణరాత్రి ప్రార్థనలో సాక్ష్యం చెబుతానని ప్రార్థించాను. 26.3.23 న మరల పరీక్ష చేయించినప్పుడు నాభర్త సుగర్ సగానికి తగ్గింది. దేవుని కృపనుబట్టి 28.3.23న అతను ఎంతో ఆరోగ్యంతో, స్వస్థతతో సంపూర్ణ రాత్రి ప్రార్థనలో పాల్గొన్నాడు. మాకు దేవుడు చూపిన కృపనుబట్టి దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**11. ప్రవీణ్ కుమార్, తార్నాక :** నేను 2007వ సంవత్సరము నుండి యు.పి.ఎఫ్.కు వస్తున్నాను. వివాహము కాకముందు ఇక్కడికి వచ్చాను. తర్వాత దేవుడు నాకు కుటుంబము కలుగజేశాడు. ఇద్దరు పిల్లలను అనుగ్రహించాడు. అప్పటినుండికూడా యు.పి.ఎఫ్.లో వాడబడుచున్నాను. ప్రస్తుతము మీడియా టీంలో పనిచేస్తున్నాను. యు.పి.ఎఫ్.లో జరుగుచున్న 40,50,100 రోజుల సిలువ ధ్యానాల్లో ఒక్కరోజుకూడా తప్పిపోకుండా హాజరౌతుంటాను. కాని దేవుడు తద్వారా నాకు, నాకుటుంబములో కీడు నష్టం కలుగకుండా కాపాడుతూ వస్తున్నాడు. ముఖ్యంగా 27.2.23 నుండి 7.4.23 వరకు జరిగిన 40 రోజుల సిలువధ్యానాల్లో 29 రోజులు వచ్చాను. 29వ రోజు రాత్రి నాకు మాసీవ్ హార్ట్ ఎటాక్ (భారీగా గుండెపోటు) వచ్చింది. కాని నేనది గుర్తించలేదు. ఛాతి నొప్పి అనుకొంటున్నాను. అసౌకర్యంగా భావిస్తున్నాను. రాత్రి 10.30 ని॥ల నుండి 12 గంటల వరకు అలాగే ఇబ్బందిపడుతూ ఒక పడగ గదినుండి మరొక పడక గదిలోకి, హాల్‌లోకి తిరుగుతున్నాను. ఉదయం 4 గంటలైనా అప్పుడు అమ్మగారు సిలువధ్యానాలకు ప్రయాణం చేస్తున్నారని ఫోన్ చేయలేదు. ఉదయం 7.30 ని॥లకు సిలువధ్యానం అనంతరం ఫోన్ చేశాను. అమ్మగారు - చాతినొప్పి వస్తే హాస్పిటల్‌కు వెళ్లాలి గాని ప్రార్థనకొరకు నాకొరకు కనిపెట్టుకొంటావా అని కోపగించుకొని వెంటనే డాక్టర్‌గారికి హాస్పిటల్‌కు ఫోన్ చేసి కావాల్సిన ఏర్పాట్లు చేయించారు. మరుసటి ఐదు నిమిషాల్లో నాకు డాక్టరు దగ్గరినుండి ఫోన్ వచ్చింది. ఎవరెవరు వెళ్లాలి ఎక్కడ కలవాలి, ఎవరిని సంప్రదించాలో వర్తమానము వచ్చేసింది. నేను హాస్పిటల్‌కు వెళ్లేసరికి ఉ॥10.30 ని॥లు అయింది. రాత్రి 10.30 ని॥ల నుండి ఉ॥ 10.30 ని॥ల వరకు భారీగా గుండెపోటు వచ్చిందని మాకు తర్వాత తెలిసింది. ప్రధానమైన కరోనరి వాల్వ్ 100 శాతం మూసుకు పోయింది. వారు పరీక్షించినప్పుడు 50 శాతం గుండె ఆగిపోయింది. అలా 14 గంటలు ఉన్నాను. అయినాకూడా కోమాలోకి వెళ్లలేదు, స్పృహ తప్పలేదు. సాధారణంగా అయితే కుప్పకూలిపోతారట. నేనైతే హాస్పిటల్‌లో ఒక డిపార్ట్‌మెంట్ నుండి మరొక డిపార్ట్‌మెంట్‌కు నడుస్తూనే తిరుగుతున్నాను. ఎక్కడ ఏ ఇబ్బంది కలుగకుండా విజయవంతంగా సెంట్ వేయుటకు దేవుడు కృప చూపాడు, ఈ కీడునుండి తప్పించాడు. అందరూ ఏదో మాట చెబుతారు గాని సహాయం చేయుటకు ముందుకు రారు కాని అమ్మగారు నాకు మాట విషయంలో, క్రియలవిషయంలో అన్ని రకాలుగా అండగా ఉండి ఆపరేషన్ అయిపోయేవరకు ఫాలో అఫ్ చేస్తూ ఉన్నారు. మరునాడు హాస్పిటల్ దర్శించి ప్రార్థించారు. దేవుని కృపనుబట్టి నేను ఈ రోజు సజీవునిగా ఉన్నాను. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి నా వందనములు. ❀

# 40 రోజులు సిలువ ధ్యానములు

రెవ.డా. జాయ్ చెరియన్ అమ్మగారు దైవ దర్శనంతో ప్రతిష్టాత్మకముగా ప్రతి సంవత్సరము లెంట్ సమయంలో పెద్ద ఎత్తున్న నిర్వహిస్తున్న "సిలువ ధ్యానములు" ప్రతిరోజు ఉ॥ 4 గం॥ల నుండి 7 గం॥ల వరకు 2023 ఫిబ్రవరి 27 నుండి ఏప్రిల్ 7 వరకు 40 రోజులు బాప్టిస్ట్ చర్చ్, హైదరాబాద్‌లో ఎంతో జయకరముగా జరిగినవి. అమ్మగారు మరియు ఇతర సంఘాల కాపరులు, సేవకులు వాక్యపరిచర్య చేశారు. ప్రతిరోజు ఏకాంత ప్రార్థనలు, ఆరాధనలు, సిలువ కీర్తనలు, సాక్ష్యములు మందిరములో వినిపింపబడినవి. ఈ మహత్తర కార్యములో అనేకులు వారి ఆత్మీయతను, ప్రార్థన జీవితమును అభివృద్ధి పరచుకొన్నారు. ప్రతిరోజు పాల్గొన్న విశ్వాసులందరికి టీ, బిస్కెట్స్ అందింపబడినవి. బాప్టిస్టు చర్చి హైదరాబాదువారు సిలువ ధ్యానములు జరిపించుటకు అనుమతించినందుకు మార్చి 21న అమ్మగారు, అయ్యగారు, యు.పి.ఎఫ్. పాస్టర్లు, రెవ. డా. సామ్యేల్ దంపతులను శాలువా, పుష్పగుచ్ఛం, కిరీటంతో ఘన సత్కారం చేశారు. 2023 ఏప్రిల్ 2న మట్టలాదివార ఆరాధన, ఏప్రిల్ 7న శుభ శుక్రవార ఆరాధన ఎంతో జయకరంగా జరిగింది. ఏప్రిల్ 8న యు.పి.ఎఫ్. రాంనగర్‌లో 14 మంది ప్రభువును రక్షకునిగా అంగీకరించి బహిరంగంగా సాక్ష్యమిచ్చి బాప్తిస్మము పొందారు. 40 రోజులు సిలువధ్యానములు విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఏప్రిల్ 8న కృతజ్ఞత కూడిక జయకరంగా జరిగింది. అమ్మగారు విచ్చేసిన వారందరికి ఆరోగ్యకరమైన అల్పాహారం ఏర్పాటు చేయిచారు. ప్రతిరోజు రాంనగర్ నుండి బాప్టిస్ట్ చర్చ్, నారాయణగూడ వరకు ఆర్.టి.సి. బస్సు ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమమంతా జాయ్, యూట్యూబ్, ఫెస్‌బుక్ మాధ్యమాల్లో ప్రచురము చేయబడింది. డెక్కన్ క్రానికల్ దినపత్రికలో ఈ కార్యక్రమమును ముద్రించారు.


"యేసు - చిన్నపిల్లలను ఆటంకపరచక వారిని నాయొద్దకు రానియ్యుడి; పరలోకరాజ్యము ఈలాటివారిదని వారితో చెప్పెను." - మత్తయి 19:14

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**

1-9-52/ఇ/3, రాంనగర్, హైదరాబాద్ - 20.

ఫోన్ : **9550504718, 9030757571**

నిర్వహించు

# వి.బి.యస్.- 2023

## (వెకేషన్ బైబిల్ స్కూల్)

**అంశము :**

## "విజేతలుగా ఉండుటకు, జన్మించారు"

**(ఓపికతో పరుగెత్తుటకు)** - హెబ్రీ 12:1-2

**తేదీలు : 27 ఏప్రిల్ (గురువారం) నుండి 06 మే (శనివారం) 2023 వరకు**

**సమయం : ఉ॥ 7.00 గం॥ల నుండి ఉ॥ 9.00 గం॥ల వరకు**

**స్థలము : యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్, పై విలాసములో**

**ప్రత్యేక కార్యక్రమములు :**

**యాక్షన్ సాంగ్స్, బైబిల్ కథలు, మిషనరీ కథలు, క్విజ్, ఆటలు పాటల పోటీలు ఇంకా మరెన్నో చక్కని బహుమతులు**

**3 సం॥ల నుండి 16 సం॥ల బాలబాలికలందరికీ ఆహ్వానము**

ప్రభు సేవలో - **జాయ్ చెరియన్**

ఫౌండర్ - ప్రెసిడెంట్, యు.పి.ఎఫ్.

# యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక రచనలు

జాయ్ చెరియన్ గారు రచించిన పుస్తకములు మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును. పోస్టుద్వారా కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

**"దేవుని వెయ్యి నామములు" - Vol - I to X** — వెల రూ. 150/-
1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — **(each one)**

**"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I** — వెల రూ. 150/-
1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)

**"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I to III** — వెల రూ. 150/-
1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — **(each one)**

**"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — వెల రూ. 150/-

**"అద్భుత కార్యములు" - Vol - I to IV** — వెల రూ. 150/- **(each one)**

**"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) — వెల రూ. 150/-

**"జీవపు మాటలు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 20/-

**"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 20/-

**"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) — వెల రూ.20/-

**"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 20/-

**"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) — వెల రూ. 20/-

**"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) — వెల రూ. 20/-

**"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) — వెల రూ. 20/-

**"తల్లి ఒప్పుకోలు" పుస్తకము** (తెలుగు) — వెల రూ. 20/-

**"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 20/-

**"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 20/-

**"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 10/-

**"మందిరముకొరకు వాగ్దానములు"** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 10/-

**"మనము దేనికొరకు ప్రార్థించాలి"** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 10/-

**"నూతర సంవత్సర క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 60/-

## విశ్వాసులకు విజ్ఞప్తి



**క్రీస్తునందు ప్రియ విశ్వాసులారా,**

నేను ఒక ముఖ్యమైన కార్యము మీతో పంచుకోవాలని ప్రేరణ కలిగియున్నాను. ప్రార్థనకూడా చేయాలని మిమ్మును కోరుతున్నాను. ఎందుకంటే ప్రార్థన అద్భుతాలు చేస్తుంది. ప్రార్థించినప్పుడే మనము ప్రభువుకొరకు గొప్పకార్యాలు చేయగలము. మనము మానవులము కాని దేవుడు తన ఆత్మతో మనలను నింపి దేవునికొరకు ఘనమైన కార్యాలు చేయడానికి వాడుకొంటాడు. **"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు."** - దానియేలు 11:32

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్.) 28 సంవత్సరముల నుండి ప్రజలకు సేవలు అందిస్తుంది. యు.పి.ఎఫ్.కు ఒక సొంత మందిరమంటూ లేదు. ఇంతవరకు ఆరాధన మందిరం కట్టబడలేదు కాని మా తండ్రి పాస్టర్ ఎ.ఎన్. మాథ్యూగారు నిర్మించిన ఆలయంలో ఆరాధన జరుగుతూ వచ్చింది. పట్టజాలనంత జనాలు వచ్చినప్పుడు ఫంక్షన్ హాల్స్‌లో ఆరాధనలు జరిపించాము. కాని ఇప్పుడు సమయం వచ్చింది. తప్పకుండా యు.పి.ఎఫ్.కు ఒక ఆలయం నిర్మించాలని ప్రభువు నన్ను ప్రేరేపించాడు. సరియైన స్థలం కొనాలి; మందిరం నిర్మాణం చేయాలి; దేవుడు సహాయకులను మంచి ఆలోచనకర్తలను అనుగ్రహించాలి. పెద్దలందరు కూడి ఈ కార్యాన్ని చేయాలని ప్రార్థిస్తున్నాను.

ఇటీవల యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ట్రస్ట్ బిల్డింగ్ ఫండ్ అని ఒక అకౌంట్ ఏర్పాటు చేశాము. ఎవరినీ బలవంతము చేయడం లేదు. ఇది దైవకార్యము. మీకు ప్రేరణ కలిగిన కొలది దైవకార్యానికి పవిత్రమైన, సంపూర్ణమైన హృదయంతో ఇవ్వాలి. ఎవరి ఒత్తిడిచేతగాని, బలవంతముచేత గాని మనము ఇవ్వకూడదు. కాబట్టి నేను దేవునికి ప్రార్థన చేస్తున్నాను; మీకు తెలియజేస్తున్నాను. దేవుడు మిమ్మును ప్రేరేపించి కార్యము చేయాలి. దేవుడు మిమ్మును ప్రేరేపించిన కొలది ఈ అకౌంట్‌లో మీరు మీ విలువైన విరాళాలు పంపిస్తే ప్రతిపైసా భద్రంగా పొందుపర్చి తప్పకుండా మందిరనిర్మాణానికి వినియోగిస్తామని తెలియజేస్తున్నాను. ఒకవేళ మీరు ఇతర యు.పి.ఎఫ్. బ్యాంక్ ఖాతాల్లోకి పంపినా అది యు.పి.ఎఫ్. బిల్డింగ్ ఫండ్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా మీరు ఈ కార్యంకొరకు ప్రార్థన చేయాలి. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్‌ద్వారా ఆశీర్వదింపబడినవారు కోకొల్లలుగా ఉన్నారు. మనము ఎక్కువగా ప్రకటనలు చేసి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోలేదు. దేవుడు మన ప్రయత్నాలు చూస్తున్నాడనే విశ్వాసం నాకు ఉన్నది. 31 సంవత్సరాలు మీరు యు.పి.ఎఫ్. ద్వారా ఆశీర్వదింపబడ్డారు. కావున మీరు తప్పకుండా యు.పి.ఎఫ్. యెడల కృతజ్ఞులైయుండాలి. దీవింపబడినవారికి నేను తెలియజేస్తున్నాను. మీకు తప్పకుండా యు.పి.ఎఫ్. పట్ల ఒక కర్తవ్యం ఉంది. తప్పకుండా మీరు మీ శాయశక్తుల సహాయపడాలి. నేను ప్రభువు ప్రేరణతో మీకు ఈ విషయం తెలియజేస్తున్నాను. ప్రభువు-**"నన్ను ప్రేమించువారిని ఆస్తికర్తలుగా చేయుదును వారి నిధులను నింపుదును."** - సామెతలు 8:21 అనే వాగ్దానమును నాకు గుర్తు చేశాడు. మనము ప్రభువును ప్రేమిస్తున్నాము; సేవిస్తున్నాము; ఆయన మాటకు విధేయులౌతున్నాము కావున తప్పకుండా ఈ కార్యం జరుగుతుందని నేను విశ్వసిస్తున్నాను. మీరుకూడా దేవుడు నా దర్శనం నెరవేర్చునట్లు ప్రార్థించాలని కోరుతున్నాను. దేవునికి సమస్తం సాధ్యమని నేను హృదయపూర్వకముగా నమ్ముచున్నాను. దేవుడు మిమ్ముల నందరినీ ఆశీర్వదించును గాక!

**United Peoples Fellowship Trust Building Fund Account**

Bank and Account Details

**Account Name : United People's Fellowship Trust Building Fund**

**A/c No. : 630501062130** **Bank : ICICI - Himayat Nagar Branch** **IFSC Code : ICIC0006305**

RNI. No. APTEL 2007/24270



## యు.పి.ఎఫ్. బ్యాంకు ఖాతాల వివరములు

**యు.పి.ఎఫ్. యూనియన్ బ్యాంకు ఖాతా వివరములు**

| | | |
|---|---|---|
| ఖాతా సంఖ్య | : | 13391110000946 |
| ఖాతా రకం | : | కరెంట్ ఖాతా |
| ఖాతా పేరు | : | యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ |
| ఖాతా శాఖ | : | రాంనగర్, హైదరాబాద్. |
| ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ | : | UBIN0813397 |

**యు.పి.ఎఫ్. ఎస్.బి.ఐ. బ్యాంకు ఖాతా వివరములు**

| | | |
|---|---|---|
| ఖాతా సంఖ్య | : | 67088374386 |
| ఖాతా రకం | : | కరెంట్ ఖాతా |
| ఖాతా పేరు | : | యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ |
| ఖాతా శాఖ | : | రాంనగర్, హైదరాబాద్. |
| ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ | : | SBIN0012917 |

**చెక్కులు : యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ పేరుతో**

(చెక్కు వెనుక మీ పేరు మరియు ఫోన్ నెంబర్ తప్పక వ్రాయగలరు)

**ఫోన్ పే / జీ.పే (గూగుల్ పే/తేజ్) : 7901236907**

**పి.ఓ.ఎస్ : కార్డ్ స్వైప్**

ప్రార్థించండి! **ప్రకటన** పాల్గొనండి!

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

ఫోన్ : 9550504718, 9030757571

**ఆదివారము ఆరాధనలు**

**"ఉదయకాల ఆరాధన మరియు సండే స్కూల్"**

ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు

**"సాయంకాల ఆరాధనలు మరియు సండే స్కూల్"**

తెలుగు ఆరాధన: ప్రతి ఆదివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు

ఇంగ్లీష్ సర్వీస్ (జూమ్ లో మాత్రమే): ప్రతి ఆదివారము సా॥ 4 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు

**వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్**, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్‌లో జరుగును.

YOUTUBE మరియు ZOOM ప్రత్యక్ష ప్రసారము (LIVE)

రాంనగర్ యు.పి.ఎఫ్. చర్చిలో డిజిటల్ సర్వీసు జరుగును.

ప్రతి రోజు **"ఉదయకాల ప్రార్థన" ఉ॥ 5 గం॥ల నుండి 7 గం॥ల వరకు**

ZOOM ప్రత్యక్ష ప్రసారము (LIVE)

**ఇతర వివరములకొరకు :**

9550504718, 9030757571 నెంబర్లను సంప్రదించగలరు.

Zoom Meeting ID : 9550504718
Passcode : 7777

– జాయ్ చెరియన్

## యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక టి.వి. కార్యక్రమము

# "జీవపు మాటలు"

**కల్వరి** ఛానెల్‌లో

ప్రతి రోజు ఉ॥ 9.00 గం॥లకు మరియు రా॥ 10.30 ని॥లకు

**శుభవార్త** ఛానెల్‌లో

ప్రతి రోజు సోమ నుండి శుక్రవారము వరకు ఉ॥ 8.00 గం॥లకు

ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు

ప్రతి శనివారము మ॥ 12.00 గం॥లకు

**ఆరాధన** ఛానెల్‌లో

ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు

**నిరీక్షణ** ఛానెల్‌లో

ప్రతి రోజు ఉ॥ 10.00 గం॥లకు

జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.

ప్రభు సేవలో
– జాయ్ చెరియన్

మా చిరునామా :

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

# 1-9-52/E/3, రాంనగర్ ఈ-సేవ కు
ఎదురుగా ఉన్న గౌతమ్ హైస్కూల్ వీధి,
మూడవ కుడి మలుపు, రాంనగర్, హైదరాబాద్ - 20.
ఫోన్ : 9030757571, 9550504718

*VISIT US AT :*

*Email : joycherian@hotmail.com,*

Subscribe : Youtube 'Joy Cherian live'

వెబ్‌సైట్ : www.upf.org.in

ఆడియో ద్వారా ప్రసంగాలు వినాలన్నా, దేవుని వెయ్యినామముల ప్రసంగములు మీరు ఇంగ్లీషు భాషలో చదువవలెనన్నా, మా వెబ్‌సైట్‌ను దర్శించండి

Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,
# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,
Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 9550504718, 9030757571
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862